నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
వరంగల్
గురువారం | ఫిబ్రవరి 27, 2025 | www.navatelangana.com



గ్రామ పంచాయతీ నిధులు విడుదల చేయాలి

● కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-నర్సంపేట

గ్రామ పంచాయతీ నిధులు విడుదల చేయాలని వరంగల్ జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షులు గుగులోతు యాకుబ్‌నాయక్ కోరారు . పంచాయతీ కార్యదర్శుల ఫోరం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సత్య శారదకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్య గ్రామ పంచాయతీలలో నిధులు లేమి, పెండింగ్ చెక్కుల చెల్లింపులు 2024 ఫిబ్రవరి నుంచి నేటి వరకు ప్రభుత్వం నిధుల విడుదల చేయలేదన్నారు. గ్రామ పంచాయతీల నిర్వహణ భారం పడి పంచాయతీ కార్యదర్శుల సతమత మతమవుతున్నారని తెలిపారు. ఏడాది నుంచి ట్రాక్టర్ నిర్వహణకు డీజిల్, ట్రాక్టర్ రిపేర్, తాగు నీటి, పైపుల లీకేజీల మరమ్మత్తులు, గేట్ వాల్, హ్యాండ్ పంపు, మోటర్‌ల నిర్వహణ, వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ భారంగా మారిందన్నారు. గ్రామ ప్రజల అవసరాలను తీర్చడానికి కార్యదర్శులపై ఆర్థిక భారం పడి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ చెక్కుల చెల్లింపులు, గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమం లో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరం వరంగల్ జిల్లా కార్యదర్శి దయ్యాలా సదానందం, అసోసియేట్ అధ్యక్షులు పోలు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు ధర్మేందర్, జాయింట్ సెక్రెటరీ భూక్య సాయిరాం వాసం శ్రీధర్, మహేష్, వరంగల్ జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

కోర్టు వివాదంలోని భూమిని కొనుగోలు చేయవద్దు..

● ఆక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నర్సంపేట



కోర్టు వివాదంలోని భూమిని కొనుగోలు చేయవద్దని, ఆక్రమించేందుకు ప్రయత్నించే వారిపై చర్యలు తీసుకోవాలని ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి నాయక్ కోరారు. ఒక ప్రకటనలో రామస్వామి పేర్కొంటూ నర్సంపేట పట్టణంలోని సర్వే నెంబర్ 111/91, 111/92లోని తాను కొనుగోలు చేసిన భూమిని కాంగ్రెస్ నాయకులు ఓర్సు తిరుపతి, పెండెం రామానంద్, పంబి వంశీలు చదును చేసి ఆక్రమించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇట్టి భూమిని 2019 జనవరి 1న భూమి యజమాని రామా అనసూర్యదేవితో విక్రయ ఒప్పందం చేసుకోన్నామని తెలిపారు. ఒప్పందం ప్రకారం 2019 జనవరి 17న బయానాగా రూ.25లక్షలు, మొదటి కిస్తీగా, రెండవ కిస్తీ రూ.75లక్షలు, రెండోవ కిస్తీగా రూ.50లక్షలు, మూడవ కిస్తీగా రూ.10లక్షలు వాయిదాల ప్రకారం చెల్లించామని చెప్పారు. బయానా ప్రకారం ఆరు ఎకరాలకు ఒప్పందం చేసుకోగా కొలత చేయగా 3.30 ఎకరాలు మాత్రమే ఉందని తేలిందన్నారు. మిగతా వాయిదాలు రిజిస్ట్రేషన్ రోజు చెల్లించడానికి నిర్ణయించుకున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ గురించి సంప్రదించగా ఇట్టి భూమి ప్రొహిబిటేడ్ జాబితాలో ఉందని తేలిందన్నారు. దీనిపై న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించగా రిట్ పిటిషన్ నెం.6502/2022 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసుకోవడం కోసం సమయం పట్టిందని, ఆ తర్వాత ఇట్టి భూమి యజమానురాలు రామా అనసూర్యదేవి మరణించారని తదనంతరం వారసులు రామచంద్రమోహన్ అతని కుటుంబ సభ్యులను సంప్రదించగా వారు రిజిస్ట్రేషన్ చేయడానికి సహకరించలేదన్నారు. సదరు వ్యక్తులు ఆస్తిని వేరే వ్యక్తులకు విక్రయిందుకు ప్రయత్నించారని దీనిపై జిల్లా కోర్టులో సివిల్ దావా వేశామన్నారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఐఏ.నెం.1176/2024 ద్వారా రామచంద్రమోహన్ అతని కుటుంబ సభ్యులు అన్యాక్రాంతం చేయకుండా నాకు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. కోర్టు ఉత్తర్వులు ధిక్కరించి వారు నాకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులతో కలసి భూమిలో మట్టి పోసి చదును చేసి అన్యాయం చేయాలని చూశారన్నారు. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి వారు ఈనెల 19న భూమిలో మేకులు పాతి, ముగ్గు పోసి ప్లాట్లు ఏర్పాటు చేసి అమ్మకానికి ప్రయత్నించారన్నారు. దీనిపై తెల్సిన నేను, తన కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లగా పై వ్యక్తులు భయాభ్రాంతులకు గురిచేసి చంపుతామని బెదిరించారని తెలిపారు. దీనిపై పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశామని, తాను కొనుగోలు చేసిన భూమిని ఇతరులకు విక్రయించకుండా చట్ట రీత్యా చర్యలు తీసుకుంటూ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బల్దియాకు సిటిజన్ ఫీడ్ బ్యాక్ అంశంలో నాలుగవ స్థానం

● మేయర్ గుండు సుధారాణి

నవతెలంగాణ-వరంగల్



స్వచ్ఛసర్వేక్షణ్-2024 సిటిజన్ ఫీడ్ బ్యాక్ విభాగం (పౌరుల అభిప్రాయం) జాతీయ స్థాయిలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నాలుగవ స్థానంతో ముందంజలో ఉన్నదని మేయర్ గుండు సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా టాప్ 100 యూఎల్‌బీలు సిటిజన్ ఫీడ్ బ్యాక్ లో సాధించిన స్కోరు ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ర్యాంకుల్లో గ్రేటర్ వరంగల్‌కు 33,833 మంది నగర వాసులు బల్దియా అందిస్తు న్న సేవలపై సానుకూల అభిప్రాయాలు వ్యక్తం చేసి అభిప్రాయాలు తెలియజేసిన నేపథ్యంలో ఈ విభా గంలో ఉత్తమంగా నాలుగవ ర్యాంకులో కొనసాగు తున్నదని చెప్పారు. బల్దియా కంటే ముందు వరుసలో ఆంధ్ర ప్రదేశ్ నుండి విజయవాడ, విశాఖపట్నంతో పాటు మహారాష్ట్ర నుండి పింప్రి చించ్వాడ్ తొలి మూడు స్థానాల్లో కొనసాగుతున్నాయి. మార్చి మొదటి వారం వరకు ప్రజలు వారి అభిప్రాయాలు వ్యక్తం చేయవచ్చునని ఇందు కోసం ప్రజారోగ్య సిబ్బంది ప్రత్యేక చొరవ చూపి నగర వాసులను ఇందులో భాగస్వామ్యం చేస్తూ ఈ అంశంలో మొదటి స్థానం దక్కేలా అధికారులు ప్రణాళిక బద్ధంగా ఉత్తమ ర్యాంకు సాధనగా కృషి చేయాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పర్వతాల శివాలయంలో.. మాజీ మంత్రి ఎర్రబెల్లి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-పర్వతగిరి



మండల కేంద్రంలోని శ్రీ పర్వతాల శివాలయం లో బుధవారం నుండి గురువారం వారకు శ్రీపర్వతాల శివాలయం శివుని తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈకార్యక్రమాలలో భాగంగా బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మహా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ టి.వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్‌నాయక్, స్థానిక ఎస్సై బి.ప్రవీణ్‌కుమార్, పర్వతగిరి మాజీ సర్పంచ్ చింతపట్ల మాలతి సోమేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, ఆర్‌డీఎఫ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆడేపు జనార్ధన్, చిదురాల వేణు గోపాల్, చింతల శ్రీనివాస్, కొల్లూరి రవి, రంగు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాలోతు సాగర్

నవతెలంగాణ-కాశిబుగ్గ



ప్రశ్నించే గొంతుక, ఉపాధ్యాయల, ఉద్యోగుల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టే అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సీఐటీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మాలోతు సాగర్ పిలుపునిచ్చారు. సమస్యలపై అవగాహన లేని అవినీతి అవకాశవాద అభ్యర్థులను ఓడించి, ప్రజా సమస్యలపై సమాజ పురోగతిపై సమగ్ర అవగాహన కలిగి ఉన్న నర్సిరెడ్డిని గెలిపించాలన్నారు. మేధావి వర్గంగా భావించే ఉపాధ్యాయులు కుల, మత రాజకీయాలతో సంబంధం లేకుండా శాసనమండలిలో చర్చలు చట్టాల రూపకల్పనలో సరైన సూచనలు ఇస్తారనే నమ్మకంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీని ఏర్పాటు చేశారన్నారు. నేడు జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేసే కొంతమంది నాయకులు ఓటర్లకు గూగుల్ పే, ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించడం ఉపాధ్యాయ వృత్తికే మచ్చ అన్నారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని నిలబెడుతూ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్న నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి జాతి భవిష్యత్తుకు, ప్రజాస్వామ్య స్ఫూర్తికి మంచి సందేశం ఇవ్వాలని సాగర్ విజ్ఞప్తి చేశారు.

టీచర్ ఓటుకు రూ.2 వేల నుండి రూ.5 వేలు



● ఖరీదు కట్టిన అభ్యర్థులు

● డబ్బు పంపిణీపై యూటీఎఫ్ ఖండన

● నేడు పోలింగ్...

నవతెలంగాణ-వరంగల్‌ప్రాంతీయప్రతినిధి:

నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్‌ల ఓటుకు ఒక రాజకీయ పార్టీ, పలు సంఘాల అభ్యర్థులు రూ.2 వేల నుండి రూ.5 వేల ధరను నిర్ణయించారు. ప్రచారం ముగియగానే టీచర్ల వ్యక్తిగత ఖాతాలకు ఫోన్ పేల ద్వారా డబ్బు పంపిణీ చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గురువారం ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడమే పరమావధిగా భావిస్తున్న ఒక జాతీయ రాజకీయ పార్టీ కేంద్ర మంత్రులను సైతం రంగంలోకి దించి ప్రచారం నిర్వహించింది. అంతేకాకుండా ఏకంగా ఒక్కో టీచర్ ఓటుకు రూ.5 వేల చొప్పున పంపిణీ చేయడం ఉపాధ్యాయ, అధ్యాపక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇదిలావుంటే మరికొన్ని సంఘాల అభ్యర్థులు రూ.2 వేల చొప్పున ఫోన్ పే ద్వారా టీచర్లకు పంపిణీ చేయడం గమనార్హం. ఇలా నగదు పంపిణీ చేయడంపై యూటీఎఫ్ తీవ్రంగా స్పందించింది. డబ్బులు పంచుతున్న పార్టీలకు, సంఘాల అభ్యర్థులకు ఓటుతో బుద్ధి చెప్పాలని యూటీఎఫ్ పిలుపునిచ్చింది. వరంగల్ జిల్లాలో ఒక అభ్యర్థి పక్షాన గుర్తు తెలియని వ్యక్తులు రూ.2 వేలు ఫోన్ పే చేసి 'పూలు' అని మెసేజ్ పంపడం చర్చకు దారితీసింది. పలువురు టీచర్లు ఈ డబ్బులను తిరిగి ఫోన్ పే ద్వారా వాపసు చేయడం గమనార్హం.

విందుల జోష్..

ఒక రాజకీయ పార్టీకి చెందిన అభ్యర్థి తరుపున పలు ప్రాంతాల్లో విందులను నిర్వహించి ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినట్లు ప్రచారం జరుగుతుంది. హన్మకొండ జిల్లాలో నగర ప్రాంతంలో అభ్యర్థులు టీచర్లను సమీకరించి పార్టీలు నిర్వహించడం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత కొన్ని రోజులుగా ఈపార్టీలను నిర్వహిస్తున్న అభ్యర్థులు, పోలింగ్‌కు సమయం దగ్గరపడుతున్న కొద్ది విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెడుతుండడం విస్మయాన్ని కలిగిస్తుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి పెద్ద ఎత్తున గెలుపే లక్ష్యంగా విపరీతంగా డబ్బులు ఖర్చు పెడుతున్నారు.

ఉమ్మడి వరంగల్‌లో 10 వేల 797 మంది ఓటర్లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10 వేల 797 మంది ఓటర్లున్నారు. అత్యధికంగా హన్మకొండ జిల్లాలో, రెండోస్థానంలో వరంగల్ జిల్లాలో అత్యధిక ఓటర్లున్నారు. నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గంలో మొత్తంగా 24 వేల 905 మంది ఓటర్లున్నారు. ఇందులో 14 వేల 940 మంది పురుషులు, 9,965 మంది మహిళా ఓటర్లున్నారు. ఈ నియోజకవర్గంలో అత్యధికంగా ఓటర్లు ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే వుండడం గమనార్హం.

హన్మకొండ, వరంగల్‌లలో కలెక్టర్‌ల పర్యవేక్షణ..

హన్మకొండ జిల్లా కేంద్రంలోని కాకతీయ డిగ్రీ కాలేజీ మైదానంలో నల్గొండ, వరంగల్, ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల సామాగ్రితోపాటు మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ మెటీరియల్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం స్వయంగా పర్యవేక్షించారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 5,215 మంది ఓటర్లున్నారు. కరీంనగర్ టీచర్స్ నియోజకవర్గంలో 166 మంది ఓటర్లున్నారు. పట్టభద్రుల నియోజకవర్గంలో 4,585 మంది ఓటర్లున్నారు. జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలున్నాయి. వరంగల్ జిల్లాలో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 13 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,352 మంది ఓటర్లున్నారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్వయంగా విచ్చేసి పోలింగ్‌సి బ్బందికి పో లింగ్ మెటీరియల్ అందించి వారిని పోలింగ్ కేంద్రాలకు తరలించడాన్ని స్వయంగా పరిశీలించారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మౌనం..

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇప్పటి వరకు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌ల మద్దతు ఎటువైపు అనేది ప్రకటించకపోవడం చర్చనీయాంశంగా మారింది. పోలింగ్‌కు ముందు ఆ పార్టీలు ప్రకటన చేసే అవకాశముందని భావించినా, ఆ రెండు పార్టీలు నేటికీ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పెదవీ విప్పకపోవడం గమనార్హం. టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి టీపీఆర్‌టీయూ అభ్యర్థిగా రంగంలోకి దిగినా, కాంగ్రెస్ మద్దతు ప్రకటించలేదు. ఇదిలావుంటే బీఆర్‌ఎస్‌కు చెందిన 'కుడా' మాజీ ఛైర్మెన్ సుందర్ రాజ్‌యాదవ్ బరిలో వున్నారు. ఆయనకు బీఆర్‌ఎస్ మద్దతు ప్రకటించలేదు. మద్దతు ప్రకటించాక ఆయా అభ్యర్థులు ఓటమి పాలైతే పార్టీపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆ పార్టీల నాయకత్వం భావించడం వల్లే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీలు మౌనంగా వుంటున్నాయని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఆలయాల్లో.. ఆధ్యాత్మిక శోభితం..

● ఆలయాల వద్ద బారులు తీరిన భక్తజనం

● భక్తులతో కిటకిటలాడిన ప్రముఖ శైవ క్షేత్రాలు

● పూజలు నిర్వహించిన ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-వరంగల్







మహాశివరాత్రి, భక్తి పారవశ్యంతో భక్తులు శివనామ తన్మయత్వంలో తపించే రాత్రి చిన్న పెద్దా, పిల్లా పాప అనే తేడా లేకుండా ప్రతి ఒక్కనెజూ శివరాత్రి వచ్చిందంటే చాలు ఎక్కడలేని ఉత్సాహంతో శివాలయాలకు వెళ్లి బారులు తీరారు. ముక్కంటిని మనసారా వేడుకున్నారు. చల్లని చూపులు లోకం పై ప్రసరించమని పూజిస్తారు. బుధవారం మహాశివరాత్రి పురస్కరించుకొని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రసిద్ధి పొందిన పుణ్యక్షేత్రాలు, శివాలయాలు శివ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలు శివనామ స్మరణతో మారుమోగాయి. మామిడి తోరణాలు, విద్యుత్ దీపాల కాంతులతో ఆలయాలు కొత్త హంగును సంతరి ంచుకున్నాయి. భక్తులు స్వామివారికి బిల్వపత్రం, ఇతర పుష్పాలు, పండ్లు ఫలాలను సమర్పించి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. ఓం నమో శివ రుద్రాయా, హర హర మహాదేవ అంటూ ఉమ్మడి ఓరుగల్లు జిల్లాలోని శైవక్షేత్రాలు శివాలయాల్లో అంటూ భక్తజనం పోటెత్తారు. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ప్రజా ప్రతినిధులు ఉన్నతా అధికారులు ప్రముఖులు బుధవారం ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న శివాలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. భక్తజనం ఓంకార నాదంతో ఆలయాలన్నీ పులకించాయి. బుధవారం వేకువజాము నుంచే ప్రముఖ శైవక్షేత్రాలు, శివా లయాల్లో అభిషేక ప్రియునికి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలైన హనుమకొండ వేయిస్తంభాల దేవాలయంలోని శ్రీ రుద్రేశ్వర స్వామి, శ్రీ సిద్ధేశ్వర స్వామి, కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వర స్వామి, కీర్తి నగర్ లోని కోటిలింగాల ఆలయం, మడికొండ మెట్టుగుట్టలోని శ్రీ రామలింగేశ్వర స్వామి, రంగంపేటలోని శ్రీ సర్వేశ్వర స్వామి, రామప్ప లోని శ్రీ రామలింగేశ్వర స్వామి, కురవి లోని శ్రీ వీరభద్రేశ్వర స్వామి, కాళేశ్వరం లోని శ్రీ ముక్తేశ్వర స్వామి, అయినవోలులోని శ్రీ మల్లికార్జున స్వామి, పాలకుర్తి లోని శ్రీ సోమేశ్వర స్వామి, బచ్చన్నపేటలోని కొడవటూరు శ్రీసిద్ధేశ్వర స్వామి తదితర క్షేత్రాలు భక్త జనులచే కిటకిట లాడాయి. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు భక్తజనుల జయ జయ ధ్వానాల నడుమ ఆది దంపతుల కళ్యాణ క్రతవును వైభవోపేతంగా నిర్వహించారు. శివపార్వతుల కళ్యాణ వేడుకలను విశేష సంఖ్యలో హాజరైన భక్త జనులు కనులారా వీక్షించి తరించి తన్మయత్వం చెందారు. భక్తులు ఉపవాస దీక్ష ఆచరించి రాత్రి జాగరణ చేశారు. జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలను ప్రజాప్ర తినిధులు, ప్రము ఖులు, ఉన్నతాధికారులు సందర్శించి దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఆర్టీసీ సంస్థ భక్తుల సౌకర్యార్థం ప్రముఖ శైవక్షేత్రాలకు బస్సు సౌకర్యం కల్పించింది.ఆలయాల్లో పరిసర ప్రాంతాల్లో తాగునీటి సదుపాయం కల్పించారు.

ప్రలోభాలకు గురికాకుండా ఓటును వినియోగించుకోవాలి

● కలెక్టర్ డాక్టర్ సత్య శారద

నవతెలంగాణ-వరంగల్



ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కు ను వినియోగించుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియో జకవర్గాల ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం సందర్శించారు. వరంగల్ కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రి బ్యూషన్ సెంటర్ లో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరు తెన్నులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీ లించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందుబాటు లో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా పీవో, ఓపీవోలతో కూడిన బృందాలన్ని హాజరయ్యాయా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. బ్యాలెట్ పద్ధతి ద్వారా పోలింగ్ ప్రక్రియను జరి పించాల్సిన తీరు గురించి, వెంట తీసుకెళ్లాల్సిన బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ సామాగ్రి గురించి ప్రయోగాత్మకంగా వివరిస్తున్న తీరును గమనిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ కొన సాగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకు న్నామన్నారు. జిల్లాలో ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్లు 2352 మంది ఉన్నారని వివరించారు. 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను అందుబాటులో ఉంచడం జరిగి ందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టు దిట్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో పీవో, ఓపీఓలను నియమించామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కలిగి ఉన్న వారు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ-పర్వతగిరి

వరంగల్ జిల్లా పర్వతగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం (నేడు)జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 38వ పోలింగ్ బూత్‌లోకి ఎన్నికల సిబ్బంది, మెటీరియల్ బుధవారం చేరుకుంది. 40 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తహసిల్దార్ వెంకటస్వామి బుధవారం తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై ప్రవీణ్ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మంద భారతి,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రానికి చేరిన సామాగ్రి

నవతెలంగాణ-నెక్కొండ

నేడు(గురువారం) జరగనున్న వరంగల్ - నల్గొండ - ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సామాగ్రి నెక్కొండ పోలింగ్ కేంద్రానికి చేరింది. నెక్కొండ పోలింగ్ కేంద్రంలో వివిధ పాఠశాలలకు చెందిన 71 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును ఉపయోగించుకోనున్నారు. ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎన్నికల సామాగ్రితో పాటు ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రానికి చేరినట్లు ఏఈఆర్ఓ, తహసీల్దార్ రాజ్‌కుమార్‌లు చెప్పారు. ఎన్నిక పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు చేపట్టారు.



ఉరి వేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ-కాశిబుగ్గ



గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లి సమీపంలోని అగ్రికల్చర్ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఏనుమాముల సీఐ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లాకు చెందిన గుంటోజు రేష్మిత (19) పైడిపల్లి సమీపంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆవరణలోని వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతుంది. మంగళవారం హాస్టల్ లోని తన రూమ్ లోకి వెళ్లిన రేష్మిత బుధవారం ఉదయం తాను ఉంటున్నా రూమ్ తలుపు తీయకపోవడంతో కళాశాల సిబ్బంది రేష్మిత తండ్రికి సమాచారం ఇచ్చారు. తండ్రి రావడంతో పోలీసుల సాయంతో గది తలుపులు పగలగొట్టి చూడగా రేష్మిత తాను ఉండే హాస్టల్ గదిలో ఫ్యాన్‌కి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు. మృతురాలి తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు.

రేష్మిత మతికి ర్యాగింగే కారణమా..?

ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీకి అనుబంధంగా పైడిపల్లి వద్ద నడుస్తున్న వ్యవసాయ కళాశాలలో గత కొంతకాలంగా ర్యాగింగ్ జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారని రేష్మిత గతంలోనే తన తండ్రి సత్యనారాయణకు చెప్పగా, ఆయన తన కూతురుకు నచ్చజెప్పి తిరిగి కాలేజీకి పంపించినట్లు సమాచారం. ఈక్రమంలోనే బుధవారం రేష్మిత బలవన్మరణానికి పాల్పడటం గమనార్హం. ఏది ఏమైనా పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపితే రేష్మిత మరణానికి ర్యాగింగ్ లేదా వ్యక్తిగత కారణాలు ఏమైనా ఉన్నాయో తెలుస్తుంది.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

నవతెలంగాణ-కాశిబుగ్గ

మహాశివరాత్రి సందర్భంగా బుధవారం శివాలయాలకు భక్తులు పోటెత్తారు. శైవ క్షేత్రాలు శివ నామస్మరణతో మారుమోగాయి. ముక్కోటి దేవుడికి మొక్కులు చెల్లించడానికి లింగ రూపంలో ఉన్న పరమేశ్వరుడికి అభిషేకాలు చేశారు. కాశిబుగ్గలోని శ్రీకాశీ విశ్వేశ్వర ఆలయనికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. కీర్తినగర్ లోని కోటిలింగాల గుడి, ఖిలా వరంగల్ శివాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ముక్కులు చెల్లించుకున్నారు. శివరాత్రి వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు శివపార్వతుల కళ్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. రాత్రికి భక్తులు జాగరణ చేసేందుకు వీలుగా ప్రత్యేకంగా ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దర్శనానికి తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం కాశిబుగ్గలోని శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయంలో చలువ పందిళ్లను, ప్రత్యేక క్యూ లైన్ లను ఏర్పాటు చేశారు.

కుంభమేళాలో చల్లా దంపతులు

నవతెలంగాణ-పరకాల / దామెర



మహా కుంభమేళా సందర్భంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగరాజ్ లోని గంగా, యమున, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి దంపతులు పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలుపుతూ ఆ భగవంతుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు వారు తెలిపారు.

వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చూడాలి : మంత్రి పొన్నం

నవతెలంగాణ-భీమదేవరపల్లి




రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్య రాకుండా చూడాలని బీసీ సంక్షేమం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులు ఆదేశించారు. మండలంలోని మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు స్వగ్రామం వంగర కైలాసక్షేత్రాన్ని ఆయన బుధవారం దర్శించుకున్నారు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా పివి మనోహర్‌రావుతో కలిసి ఆయన ప్రత్యేకపూజలు నిర్వహించారు ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు ఎన్నికల కోడ్ ఉన్నందున అధికారులు బాధ్యతతో నీటి సమస్య రాకుండా చూడాలన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఐలయ్య కొలుగూరి రాజు ఆదరి రవీందర్ మాజీ ఎంపీపీ అశోక్ ముఖర్జీ మండల పరిషత్ మాజీ వైస్ చైర్మన్ మాడుగుల ఎజ్రా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు చిదురాల స్వరూప ఏసీపీ తిరుమల్ నాయకులు వెంకట్ రెడ్డి పెద్ది వెంకటనారాయణ గౌడ్ ఒల్లాల రమేష్ పాల్గొనగా ఎల్కతుర్తి సీఐ రమేష్ ముల్కనూర్ వంగర సాయిబాబు దివ్య బందోబస్తు నిర్వహించారు

ఆలయాలకు పోటెత్తిన జనం









నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

మహాశివరాత్రి.. భక్తి పారవశంతో భక్తులు శివనామ తన్మయత్వంలో తపించే రాత్రి.. చిన్న పెద్ద పిల్లా పాప అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు శివరాత్రి వచ్చిందంటే చాలు ఎక్కడలేని ఉత్సాహంతో శివాలయాలకు పరుగులు తీస్తారు. ముక్కంటిని మనసారా వేడుకుంటారు. చల్లని చూపులు లోకంపై ప్రసరించమని ప్రార్థిస్తారు. బుధవారం మహాశివరాత్రి పురస్కరించుకొని ఉమ్మడిజిల్లాలోని ప్రసిద్ధి పొందిన పుణ్యక్షేత్రాలు, శివాలయాలు శివ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలు శివ నామస్మరణలతో మార్మోగాయి. భక్తులు స్వామివారికి బిల్వపత్రం, ఇతర పుష్పాలు, పండ్లు, ఫలాలను సమర్పించి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు.

పవిత్ర మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని చారిత్రాత్మకమైన వేయి స్తంభాలఆలయంలో రుద్రేశ్వర స్వామి వారిని పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రుద్రేశ్వరుడికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. మొదటగా ఆలయానికి చేరుకున్న ఎంపీ, ఎమ్మెల్యేలకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజలు చేసిన తర్వాత అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు. అనంతరం సిద్దేశ్వరాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. పరమశివుడు రాష్ట్ర ప్రజలను సంతోషంగా చూడాలని ఆకాంక్షించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. శివరాత్రి ఉపవాస పూజలను భక్తి ప్రపత్తులతో నిర్వహిస్తున్న భక్తులకు ఆ దేవదేవుని ఆశీర్వాదం ఎల్లవేళలా వుండాలని కోరుకున్నారు. చరిత్రాత్మకంగా ఎంతో ప్రసిద్ధి చెందిన వేయి స్తంభాల గుడి అభివృద్ధి కృషి చేస్తాను ఎంపీ స్పష్టం చేశారు.

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నాయిని నీలిమరెడ్డి, కుమార్తె అల్లుడు డాక్టర్ గోదా, విష్ణువర్ధన్ రెడ్డి కుటుంబ సమేతంగా నగరంలోని వేయి స్తంభాల శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని,శ్రీ సిద్దేశ్వర స్వామి దర్శించుకొని ,అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోనీ శివాలయం దర్శించుకుని ముక్కులు చెల్లించారు. మహా శివరాత్రిని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.

స్వయంభు శ్రీ జలేశ్వరాలయంలో పొట్టెత్తిన భక్తులు



మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని హనుమకొండ చౌరస్తా కాకాజి కాలనీలో స్వయంభు శ్రీ జలేశ్వరాలయంలో పొట్టెత్తిన భక్తులు స్వయంభు శ్రీ జలేశ్వరాలయ ఉపాధ్యక్షుడు మట్ట శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి రోజున భక్తి శ్రద్ధలతో శివభక్తులు శివనామం జపిస్తూ చేపట్టే ఉపవాస దీక్షలు, రాత్రి జాగరణ, పూజలు, అభిషేకాలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రతి ఒక్కరిలో ఆత్మశుద్ధిని, పరివర్తనను కలిగిస్తాయని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నిసౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగింది.

మాజీ ఎమ్మెల్యే దాస్యం ప్రత్యేక పూజలు



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని ప్రసిద్ధ వేయి స్తంభాల దేవాలయ రుద్రేశ్వరుడికి మాజీ చీఫ్‌విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు నిర్వహించారు. ఆ పరమశివుడి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు.

హనుమకొండ బస్టాండ్ వద్ద ఉన్న బ్రహ్మకుమారిస్ శాఖలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

దామెరలో...



దామెర : దామెర మండలంలోని పలు ఆలయా ల్లో ఒగ్లాపూర్, ఊరుగొండ, ముత్యాలపల్లి, తక్కలపాడు, పసరుగొండ, వెంకటాపూర్, కొగిల్వాయి తదితర గ్రామాల్లో మహాశివరాత్రి సందర్భంగా భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. పలువురు నాయకులు శివాలయాలను సందర్శించి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఓం నమో శివాయ అంటూ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా పలు ఆలయాల వద్ద సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామాల్లో అధికారులు నాయకులు భక్తులకు కావలసిన సౌకర్యాలను కల్పించారు.

వేలేరులో....



వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల గ్రామపరిధి లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీగట్టుమల్లికార్జునస్వామి, మండల కేంద్రంలోని వేలేరు లో శ్రీ భవాని రుద్ర రామేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి, కమ్మరిపేటలోని కోటిలింగాల గుడులతోపాటు మండలంలోని వివిధగ్రామాలలోని శైవక్షేత్రాల్లోబుధవారం శివరాత్రిపర్వదినం సందర్భంగా మాస, మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మహాశివ రాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపి గ్రామ ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రజలు ఆకాంక్షించారు.

మల్లి కుదుళ్ల గ్రామ పరిధిలోని శ్రీ గట్టు మల్లికార్జున స్వామి, మండల కేంద్రంలోని వేలేరు లో శ్రీ భవాని రుద్ర రామేశ్వర స్వామి, కమ్మరి పేట్ గ్రామ పరిధిలోని అతి పురాతన శివాలయాలలో దేవాలయాలలో మాస శివరాత్రి, మహాశివరాత్రి సందర్భంగా ఉదయం నుండి పెద్ద ఎత్తున అభిషేకాలు అర్చనలు కోడలు కట్టుట వంటి కార్యక్రమాలతో భక్తులు మొక్కుబడులు ఆచరించి స్వామి కృపకు పాత్రులయ్యారు. ఆలయ అర్చకులు సత్యనారాయణ, వినయశర్మ, పరమేశ్వర్, మహేశ్ లు మాట్లాడుతూ బుధవారం రాత్రి 11 గంటల నుండి స్వామి కళ్యాణ మహోత్సవ అనంతరం లింగోద్భవ కాలమున అత్యధికంగా భక్తులు వస్తారని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

శ్రీగట్టుమల్లికార్జున స్వామి ఆలయంలో ఈఓ అద్దంకి నాగేశ్వర్ రావు, ఆలయాల నిర్వాహకులు ఉత్సవాలకు ఏర్పాట్లు చేసారు. ఆలయాలలో భక్తిశ్రద్ధలతో ప్రజలు మహాశివరాత్రి ఉత్సవం ఘనంగా జరిపారు.



నడికూడ : మండలంలోని కౌకొండ గ్రామ ఉమామహేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, పూలతో సుందరంగా అలంకరించి వేద పండితులతో మహాశివ రాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి గ్రామస్తులంతా మంగళహారతులతో పూలు, పండ్లు, నైవేద్యాలు తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వ హించారు. భక్తులంతా ఉపవాసంతో జాగరణలు చేస్తూ శివ నమం స్మరిస్తూ శివ కళ్యాణంలో పాల్గొని ఆమహాదేవుని కృపకుపాత్రులయ్యారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. ఊరుఊరంతా పండగ వాతావరణం నెలకొంది. అనంతరం శివరామకృష్ణ భజన మండలి ఆధ్వర్యంలో భజనలు నిర్వహించారు.

ఆత్మకూరులో...

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు మండ లంలోని ఆయా గ్రామాలలో బుధవారం మహాశివరాత్రి ఉ త్సవాలు వైభవంగా జరిగాయి. మండల కేంద్రంలోని పంచకూట మహాదేవస్వామి ఆలయంలో అభిషేకాలు అర్చనలు జరిగాయి. సాయంత్రంసాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగాజరిగాయి. వరంగల్ డా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కటాక్షపూర్ గ్రామంలోని కోటగుళ్ల ఆలయంలో మాజీ ఎంపీపీ మార్క సుమలత రజనీకర్, స్థానిక మాజీ సర్పంచ్ యాదగిరి, బిజెపి నాయకులు డాక్టర్ పగడాల కాళీప్రసాద్, సీఐ ఆర్.సంతోష్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మం డలంలోని పెంచికల పేట గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం ,పెద్దా పూర్‌లోని రామప్ప శివాలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. సీఐ సంతోష్, ఎస్ ఐ తిరుపతి బందోబస్తు నిర్వహించారు.

ఐనవోలులో...

ఐనవోలు : ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణలో మహా శివరాత్రి పర్వదినం నిర్వహిస్తున్న పెద్ద పట్నం కార్యక్రమంలో పాల్గొని మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల కోసం చేసిన ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పరిసర ప్రాంతాలను స్వయంగా తిరుగుతూ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మనం అందరికి అన్నదానం చేయడం ఒక గొప్ప సంప్రదాయం. భక్తులకు ఆ హారం అందించడం, వారి కష్టాలను తీర్చడం మన బాధ్యత. ఈ కార్యక్రమం ద్వా రా ప్రతి ఒక్కరి ముఖంలో చిరునవ్వు తేవాలని మనం ఇక్కడకి వచ్చాం. శివరాత్రి రోజు ఒక పుణ్యకార్యంగా,అందరూ భక్తిశ్రద్ధలతో ఉండాలని, ప్రజలు ప్రతి ఒక్కరికీ సహాయం చేయాలని కోరుకుంటున్నాం అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

ఐలోని మల్లన్నకు పెద్దపట్నం

శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం నందు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం ఉదయం 8 గంటలకు సింహ వాహనసేవ, ఒగ్గు పూజరులచే పెద్దపట్నం వేశారు. అష్టోత్తరశతకలశార్చన, రుద్రహవనము, రుద్రపారాయణం, రాత్రి లింగోద్భవకాలంలో అష్టోత్తర శతకలశములచే విశేష అభిషేకము.రాత్రి గం 7గంటలకు నందివాహన సేవ, శ్రీ భ్రమరాంబిక మల్లిఖార్జునస్వామి వారి కళ్యాణోత్సవం నిర్వహించారు.

భక్తులపై పోలీసుల లాఠీచార్జి

ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి పురస్కరించుకొని నాలుగు గంటలు కష్టపడి ఒగ్గు పూజారులు వేసిన పెద్దపట్నం, పట్నం తొక్కడానికి బారులు తీరిన భక్తులు, భక్తలపై లాఠీ చార్జి చేసిన పోలీసులు, కవర్ చేస్తున్న మీడియాపై దురుసుగా ప్రవర్తించిన పోలీసులు.

రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న సిరికొండ









శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలోని అతిపురాతనమైన శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ శాసనమండలి ప్రతిపక్షనేత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి సందర్శించి శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అనుదీప్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థప్రసాదాలను సిరికొండ మధుసూదనాచారికి అందజేశారు శాయంపేట మండలంలో ఘనంగ మహా శివరాత్రి ఉత్సవాలు మండల కేంద్రంలోని శ్రీ మత్స్యగిరిస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శ్రీశివ మార్కండేయ స్వామి ఆలయం మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో బుధవారం మహా శివరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగ నిర్వహించారు ఈ సందర్భంగ అర్చకులు స్వామి వారికి పంచామృత అభిషేకాలు అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు రాత్రి శివపార్వతుల కళ్యాణం అర్చకులు అంగరంగ వైభవంగ నిర్వంచారు ఈ సందర్భంగ భక్తులు ఉపవాసంతో రాత్రంత జాగారం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆలయాల చైర్మన్లు భక్తులు పాల్గొన్నారు.

పెయిన్ క్లినిక్ ప్రారంభించిన మంత్రి సీతక్క



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

హనుమకొండ పట్టణంలోని బాలసముద్రంలోని చక్రవర్తి హాస్పిటల్ 5 వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, వరంగల్ పశ్చిమఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిలు హాజరై నూతనంగా ఏర్పాటు చేసిన పెయిన్‌క్లినిక్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలని, ఐదు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చక్రవర్తిహాస్పిటల్ యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. వైద్యరంగంతో పాటు సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్న హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ ఎం.తరుణ్‌రెడ్డిని అభినందించారు.

బహుజనవాదానికి జీవం పోయాలి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ఈ నెల 27 జరిగే వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ధర్మ టీచర్స్ యూనిటీ బలపరిచిన ఇండిపెండెంట్ అభ్యర్థి దామెర బాబురావుకు అన్ని వర్గాల టీచర్స్ యూనియన్ల నేతలు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ప్రచారంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు బ్రహ్మరథం పట్టారు.ఉపాధ్యాయ ఉద్యమకారుడు దామెర బాబురావు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించవలసిందిగా టీచర్స్ యూనియన్ల నేతలు పిలుపునిచ్చారు.

కార్డు కొత్తగా.. సాంకేతికంగా

- దివ్యాంగులకు యూడీఐడీ కార్డులు
- మార్చి నుండి అమలుకు శ్రీకారం

నవతెలంగాణ-సుబేదారి

సదరం శిబిరం, దివ్యాంగుల గుర్తింపు కార్డును మరింత పదిలంగా, మెరుగ్గా పకడ్బందీ నిర్వహణకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. అర్హులకు దేశవ్యా ప్తంగా గుర్తింపునిచ్చేలా కార్డులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. పాతవిధానానికి స్వస్తి చెప్పి మార్చి నుంచి నూతనంగా యూడీఐడీ (దివ్యాంగుల గుర్తింపు కార్డు) సేవలు ప్రారంభిస్తున్నారు. ఇక నుంచి పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ ద్వారానే అర్హుల వైకల్య శాతాన్ని వైద్యులు నమోదు, నిర్ధారణ, కార్డు మంజూరు దీని ద్వారే చేయనున్నారు. శిబిరం నిర్వహించే వైద్యులు ఇంతకుముందు మాదిరిగా వందలకొద్ది పత్రాలపై సంతకాలు చేయాల్సిన అవసరం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. నూతన విధానంలో డిజిటల్ సంతకాలను ప్రవేశపెడుతున్నారు. దీంతో వైద్యులకు పనిభారం తగ్గనుంది.

మొన్నటి వరకు దివ్యాంగులకు ఇచ్చే సదరం పత్రం కేవలం రాష్ట్రానికే పరిమితమైంది. ఇక నుంచి ఆ స్థానంలో నూతనంగా ప్రవేశపెట్టిన యూడీఐడీ కార్డు అందించనున్నారు. మూడురంగులతో కూడిన ఈ కార్డులను 10శాతంలోపు, 40-70 శాతం, 75-100 విభాగాలుగా విభజించి పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే జిల్లాలోని సదరంపత్రం ఉన్న అర్హులకు పోస్టుద్వారా ఈ యూడీఐడీ అందుతున్నాయని తెలుస్తోంది. ఆయా శిబిరాల నిర్వహణ అనంతరం కార్డు జారీ చేయనున్నారు. ఇక దేశంలో ఎక్కడికి వెళ్లినా దివ్యాంగులకు ఈ కార్డు పనిచేస్తుంది. బస్సు, రైళ్లతో పాటు వీరికే అందే అన్ని అవకాశాలకు లబ్ధి చేకూరనుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రయోజనం చేకూర్చనుంది.

కార్డు డిజిటల్ సంతకాలు.. ప్రత్యేక శిక్షణ ...

ఈ యూడీఐడీకి సంబంధించి విధివిధానాలపై సదరం శిబిరం నిర్వహించే వైద్యుల సంతకాలను డిజిటల్ రూపంలో సిద్ధం చేసి పంపించారు. గతంలో



మాదిరిగా పరీక్షలు చేసిన తర్వాత డాటా ఎంట్రీ ఆపరేటర్ ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తారు. ఆయా సమాచారం, ఇచ్చిన వైకల్య శాతాన్ని వైద్యుల లాగిన్‌కు చేరుతుంది. ఒకసారి ఆ వివరాలన్ని సరిగ్గా ఉన్నాయా ? లేదా ? అని సరిచూసుకున్న తర్వాత అప్‌లోడ్ కొట్టగానే కార్డు మంజూరై పోస్టు ద్వారా ఇంటికి చేరుతుంది. ఈ విధానం నూతనంగా ప్రవేశ పెడుతుండటంతో ఒకటి, రెండు శిబిరాల తర్వాత గానీ పూర్తిస్థాయి అవగాహన వచ్చే అవకాశంలేదని వైద్యులు, ఆయా శిబిరాల ఆసుపత్రి సిబ్బంది తెలుపుతున్నారు.

దివ్యాంగులకు వర్తింపు ....

వివిధ రాష్ట్రాల్లో దివ్యాంగులకు పలు రకాల పత్రాల పొందుతుండగా కొంతమంది రెండు, మూడు చోట్ల వీటిని తీసుకుంటున్నారని ప్రభుత్వాల దృష్టికి వచ్చినట్లు తెలిసింది. ఆయా చోట్ల పెన్షన్లు కూడా తీసుకుంటున్నారని సమాచారం. దీంతో దివ్యాంగులకు ఒకే దేశం ఒకే కార్డు విధానాన్ని తీసుకొచ్చినట్లు తెలుస్తుంది. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో అమలవుతుండగా ఇక తెలంగాణలోని దివ్యాంగులకు వర్తించనుంది. శిబిరాల నిర్వహణ సులువు కావడంతో పాటు అర్హులకు మరింతలబ్ధి చేరేఅవకాశంఉంది. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. స్వావలంబనకార్డు. జీఓవీ. ఇన్ సైట్‌లో మార్చి 6న ప్రారంభించనున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

నవతెలంగాణ-ఆత్మకూరు



నేడు గురువారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆత్మకూర్ తహసిల్దార్ జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నా రు. బుధవారం ఆయన మా ట్లాడుతూ మండలంలోని జూనియర్ కాలేజీలో జరుగు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన మెటీరియల్ ఎన్నికల సిబ్బంది, పోలీస్ సిబ్బంది ఆత్మకూరుకు చేరుకోగా వారికి అన్నిరకాల వసతి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. మండలంలో ఉపాధ్యాయ ఓటర్లు 69 మంది నమోదయ్యారు. గురువారం ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహిం చడం జరుగుతుందని తహసిల్దార్ వివరించారు.

పోలింగ్ సెంటర్‌ను పరిశీలించిన సీఐ

నవతెలంగాణ-ఎల్కతుర్తి



నేడు జరుగుతున్న ఎమ్మెల్సీ పోలింగ్ సెంటర్‌ను, ఎల్కతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పులి రమేష్ సాయంత్రం పరిశీలిం చారు. సిబ్బందితో మాట్లాడుతూ, 901 గ్రాడ్యుయేషన్ ఓటర్లు, 29 మంది ఉపాధ్యాయులు ఓటర్లు ఉన్నారన్నారు. ఎవరైనా సరే పోలింగ్ స్టేషన్లోకి, సెల్ ఫోన్, వాటర్ బాటిల్, ఏ వస్తువులైన తీసుకురాకూడదన్నారు. సిబ్బంది జాగ్రత్తగా ఉండి పరిశీలించాలన్నారు.

పోలింగ్ స్టేషన్ 100 మీటర్ల దూరం పరిధి నిర్ణయించి మార్కు వేయాలన్నారు. ఆయన వెంట సిబ్బంది, రాజు, గణేష్, సుమన్ ఉన్నారు .

మనస్తాపం చెందిన యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-చిట్యాల



మనస్తాపం చెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చిట్యాల మండలం వెంచరామి గ్రామంలో బుధవారం జరిగింది. స్థానిక ఎస్సై శ్రవణ్ కుమార్ తెలిపిన కతనం ప్రకారం.. వెంచరామి గ్రామానికి చెందిన దాసరి రక్షిత్‌కుమార్(18) ఇంట్లో తన తల్లీదండ్రులు గొడవపడుతుండగా చూసి మనస్థాపానికి గురై బయటికి వెళ్లి మద్యం తాగి వచ్చాడు. ఈ క్రమంలో తండ్రి మందలించిగా మనస్థాపానికి గురై ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో పరకాల లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారం రోజుల చికిత్స అనంతరం కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందూతూ మంగళవారం మృతి చెందాడు.మృతుడి తండ్రి దాసరి యుగేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చూస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

జయశంకర్
ములుగు - భూపాలపల్లి
గురువారం ఫిబ్రవరి 27, 2025

శ్రీ లలిత శారీ సెంటర్ ప్రారంభం.. హాజరైన మంత్రి సీతక్క

నవతెలంగాణ- ములుగు



ములుగు జిల్లా కేంద్రంలోని ఎస్బిఐ బ్యాంక్ ఎదురుగా శ్రీ లలిత సారి సెంటర్ అండ్ క్లాత్ స్టోర్‌ను రాష్ట్ర మంత్రి డాక్టర్ సీతక్క బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లా కేంద్రమైనప్పటికీ గ్రామీణ ప్రజలకు అవసరాలకు అనుగుణంగా సరిపడే షాపింగ్ లేక వరంగల్ లాంటి ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అనుకూలంగా ములుగు పట్టణంలో వస్తువులు, వస్త్రాలు అందించే విధంగా షాపులు ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బాణోత్ రవి చందర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన మహా శివరాత్రి వేడుకలు

కాళేశ్వరంలో ఘనంగా శివపార్వతుల కళ్యాణం

- 2.20లక్షల పైచిలుకు సందర్శకుల సందర్శన
- పట్టు వస్త్రాలు సమర్పించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
- ప్రముఖుల పూజలు

నవతెలంగాణ-కాళేశ్వరం














శివనామస్మరణంతో కాళేశ్వరం దేవస్థానం మార్మోగింది. త్రివేణి సంగమ గోదావరి నది భక్త జనులతో పులకించిపోయింది. శివ పార్వతుల కల్యాణం కన్నుల పండువగా జరగగా, అశేష భక్త జనం దర్శించుకోవడంతో కాళేశ్వరం 'మహా' జాతరగా మారింది. శ్రీ కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి పండుగలో ప్రధాన ఘట్టంలో భాగంగా బుధవారం సాయంత్రం 05.30గంటలకు శ్రీ ముక్తీశ్వర శుభానంద కల్యాణ మహోత్సవం అంగరంగ వైభంగా జరిగింది. ఆలయ పండితులు కృష్ణ మూర్తిశర్మ, నగేశ్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా జరిగింది. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకురాగా, మాజి ఎంపీటీసీ మమత నాగరాజు, ఈఓ మహేష్ దంపతులు ముత్యాల తలంబ్రాలు తీసుకొచ్చి ఉత్సవ మూర్తులకు సమర్పించారు. అనంతరం స్వామివారి కల్యాణం అత్యంత కన్నుల పండువగా జరగింది. రాత్రి ఆలయ ఆవరణలో హరికథా కాలక్షేపం, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహాభిషేకం, లింగోద్భవకాలానంతరం, చండీహవనం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజలు స్వామిని దర్శించుకున్నారు. మహారాష్ట్ర, చత్తీస్గఢ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అశేష సంఖ్యలో జనం తరలిరాగా, పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపట్టారు. మహా శివరాత్రి పురస్కరించుకొని శ్రీ కాళేశ్వర, ముక్తీశ్వర స్వామిని బుధవారం సుమారు 2.20 లక్షల పై చిలుకు జనం దర్శించుకున్నారు. మూడు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్త జనులతో త్రివేణి సంగమం పులకించింది. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి పూజలు చేశారు. అక్కడి నుండి ఆలయంకు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కాగా సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేపట్టారు. ఆలయ అధికారులు గోదావరి నది స్నాన ఘట్టాలు, ఇతర వసతులు కల్పించారు. అలాగే ఆలయంలో బారీకేడ్లు, తాగునీటి సరఫరాతోపాటు ముందస్తుగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పలు చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. పలువురు సందర్శకులు, పలు స్వచ్ఛంధ సంస్థల సభ్యులు సేవలందించారు. అలాగే కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఈవో మహేష్ ఆధ్వర్యంలో వారికి స్వాగతం పాలికి సన్మానించారు. కాటరం డీఎస్పీ రామ్‌మోహన్‌రెడ్డి, మహరాష్ట్రకు చెందిన పోలీస్ అధికారులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ఆలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, తదితరులు దర్శనం చేసుకున్నారు. కాగా సందర్శకులను పోలీస్‌లు ఇబ్బంది పెట్టారు. గోదావరి తీరంలో పుణ్య స్నానం లు చేసి కాళేశ్వరం ఆలయంకు వస్తున్న క్రమంలో అక్కడ ఉన్న పోలిస్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్‌లు మహాదేవపూర్ కు చెందిన ప్రజల పట్ల దుర్భాషాలాడారు. కాగా వారు మహాదేవపూర్ సీఐ రాంచందర్‌రావుకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-గణపురం




మండలంలోని బుద్దారం గ్రామంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు. పద్మ దంపతులు పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శేషాచార్యులు వారి అర్చక బృందం, గ్రామస్తులు ఎమ్మెల్యే దంపతులకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గోశాల, కళ్యాణ మండపాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మహా అన్నప్రసాదాన్ని ప్రారంభించారు. స్థానికులు,తదితరులు పాల్గొన్నారు.

కోటగుళ్ళకు పోటెత్తిన సందర్శకులు

- అడిషనల్ కలెక్టర్, ఓఎస్‌డి కిషన్, డీఎస్పీ సంపత్‌రావు పూజలు

నవతెలంగాణ-గణపురం :







కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళకు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి పోటెత్తారు. తెల్లవారుజామున గణపతి పూజ, అఖండ దీపారాధనను అర్చకులు గంగాధర్, నాగరాజు, శంకర్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది భూపాలపల్లి అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి. భూపాలపల్లి ఓఎస్‌డి బోనాల కిషన్ దంపతులు, డీఎస్‌పి సంపత్‌రావు దంపతులు, భూపాలపల్లి సీఐ దొమ్మాటి నరేష్ కుమార్‌గౌడ్, గణపురం ఎస్ఐ రేఖ అశోక్ దంపతులు అభిషేకంలో పాల్గొని పూజలు చేశారు. శివరాత్రి జాగరణ సందర్భంగా కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు.

పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

నవతెలంగాణ-భూపాలపల్లి



27వ తేదీన జరుగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌శర్మ తెలిపారు. బుధవారం ఐడీఓసి కార్యాలయంలో జరుగుతున్న పోలింగ్ మెటిరియల్ పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల నిర్వహణలో ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గ ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల్లో పురుషులు 215మంది మహిళా ఓటర్లు 114 మంది మొత్తం 329 మంది ఓటు హక్కు వినియోగించుకోవడానికి భూపాలపల్లి, మొగుళ్లపల్లి, చిట్యాల, గణపురం, రేగొండ, టేకుమట్ల, కొత్తపల్లి ఘోరి లాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయుల పట్టభద్రులకు మహా దేవపూర్, మహా ముత్తారం, మల్హర్‌రావు, కాటారం, పలిమెల మండలాల్లో 5పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 64మంది పురుషులు, 19 మంది మహిళలు మొత్తం 83మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. పట్టభద్రులకు సంబంధించి నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు 5 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహాదేవపూర్, మహా ముత్తారం, మల్హర్ రావు, కాటారం, పలిమెల మండలాల్లో ఏర్పాటు చేసిన ఈ పోలింగ్ కేంద్రాల్లో 1734 మంది పురుషులు, 749 మంది మహిళలు మొత్తం 2483మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. 27వ తేదీన ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. 27వ తేదీన పోలింగ్ ముగిసిన తదుపరి ఐడీఓసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రంలో పోలింగ్ మెటీరియల్ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పట్ట భద్రులు, ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. నాలుగు రూట్లుగా విభజించి ప్రతి రూటుకు ఒక లైజన్ అధికారి, రూటు అధికారులను నియమించి నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఆర్డీఓ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్టాపనకు భూమిపూజ

నవతెలంగాణ-మల్హర్‌రావు



మండలంలోని నాచారం గ్రామంలో భూలక్ష్మీ, మహాలక్ష్మీ భువనేశ్వర స్వామి విగ్రహాల ప్రతిష్టాపన కోసం బుధవారం గ్రామస్తులు వేదపండితులతో భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీక్రోదినామ సంవత్సర శుభసందర్భంగా విగ్రహాల ప్రతిష్టాపన కోసం భూమిపూజ చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయి బొగ్గు రవాణా...


నవతెలంగాణ -కోల్‌బెల్ట్



భూపాలపల్లి ఏరియాలో ఒకేరోజు రికార్డు స్థాయిలో 15,290 టన్నుల బొగ్గు రవాణా జరిగిందని ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి ప్రకటనలో వెల్లడించారు. గతంలో మునిపెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయి బొగ్గు రవాణా జరగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దీనికి సహక రించిన ఉద్యోగులకు, సూపర్వైజర్లకు, అధికారులకు, యూనియన్ నాయ కులకు కృతజ్ఞతలు తెలిపారు. మున్ముందు లక్ష్యాలను కూడా ఇదే సూర్తిని కొనసాగించి, రక్షణతో కూడిన ఉత్పత్తికి సహకరించాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకి ఆర్థిక చేయూత

నవ తెలంగాణ-గోవిందరావుపేట



ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన టెంట్ హౌస్ అసోసియేషన్ సభ్యులు అశోక్ కుటుంబానికి అసోసియేషన్ తోటి సభ్యులు ఆర్థికచేయుతను అందించారు. బుధవారం అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ అతనికి ఆర్థిక చేయూత ఇచ్చే కార్యక్రమంలో భాగంగా పదివేల రూపాయల ఆర్థిక సహాయంతో పాటు 2 లక్షల రూపాయలను వడ్డీ లేకుండా ఐదు నెలల పాటు టెంట్ హౌస్ అసోసియేషన్ సభ్యులు చేయూత ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో టెంట్ హౌస్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి కరా?కర్ రెడ్డి, సభ్యులు చేల్పూరి రాజకుమార్, అంకం వినయ్ కుమార్, అన్నే గౌతమ్ కుమార్, పేర్వాల సురేష్, చందుపట్ల మచ్చ గిరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివరాత్రి మహోత్సవ వేడుకలు

నవతెలంగాణ-గోవిందరావుపేట

మండల వ్యాప్తంగా మహాశివరాత్రి మహోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. చల్వాయి గ్రామం, గోవిందరావుపేట మండల కేంద్రాల్లో శివాలయాల్లో ఉదయం 5 గంటల నుండి భక్తులు శివనామస్మరణతో పూజ కార్యక్రమాలను నిర్వహించారు. పసర గ్రామంలోని రామాలయంలో శివరాత్రి దీపోత్సవ కార్యక్రమాలను ప్రధాన పూజారి డింగిరి రంగాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శివరాత్రి పండగ సందర్భంగా రాజకీయ నాయకులు మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ బ్యానర్లు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలిపారు. మిత్రులు భక్తులు ఉపవాస దీక్షలు జాగారాలు నిర్వహించారు.

నేడు 'ఎమ్మెల్సీ' ఎన్నికల పోలింగ్.. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలన

- జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర

నవతెలంగాణ - ములుగు





వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌బుధవారం సందర్శించారు. కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను పరిశీలించారు. తాగునీటి వసతి, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీఓ, ఏపీఓ, ఓపీఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యాయా లేదా అని ఆరా తీశారు. పోలింగ్‌లో ఎలాంటి లోటు పాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని అందించాలన్నారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బస్సులను పరిశీలించారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరు కునేలా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. కాగా, జిల్లాలో 9 పోలింగ్ కేంద్రాలలో నేడు గురువారం ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ఓటింగ్ కొనసాగుతుందని తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయ ఆవరణల్లో బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామాగ్రి అందించామని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి సిబ్బంది తమకు కేటాయించిన వాహనాలలో నేరుగా పోలింగ్ స్టేషన్లకు చేరుకుని పోలింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు చే సుకుంటారని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కలిగి ఉన్న వారు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఒవెన్యూ అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి, ఆర్డీఓ వెంకటేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.





ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

నవతెలంగాణ-ములుగు

మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం ములుగు జిల్లాలోని వివిధ మండలాలలో కోలహాలతో శివాలయాలు మార్మోగాయి. పురాతన శివాలయాలను కలిగి ఉన్న గ్రామాలలో ప్రజలు, యువకులు రెండు రోజుల నుంచి అన్ని సౌకర్యాలు కల్పించడంతో మహిళలు, పిల్లలు కుటుంబ సభ్యులతో సహా శివాలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు. వెంకటాపూర్ మండలంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రామప్ప దేవాలయంకు పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చి రామలింగేశ్వరుని దర్శించుకున్నారు. ములుగు పట్టణంలోని శివాలయం, రామాలయంతో పాటు గ్రామ గ్రామాల మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామప్ప, ములుగు శివాలయం దేవాలయాల్లో జాగారాలు ఉండే భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పటిష్ట బందోబస్తు : ములుగు డీఎస్పీ



వెంకటాపూర్ మండలం పాలంపేట రామప్ప దేవాలయంలో బుధ వారం నిర్వహించే మహాశివరాత్రి జాతరలో పాల్గొనడానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ట్రాఫిక్, క్యూ లైన్స్ వద్ద ఎటువంటి అవాం ఛనియ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ములుగు డీఎస్పీ నలువాల రవీందర్ ఆధ్వర్యంలో 300మంది సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎటువంటి దొంగతనాలు జరగకుండా ఉండేందుకు మఫ్టీలో సిసిఎస్ సిబ్బందికి విధులు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం నుండి పటిష్ట పోలీస్ బందోబస్త్ రామప్పలో కొనసాగుతుందని, ఇప్పటివరకు భక్తుల దర్శన, ట్రాఫిక్ నియంత్రణ ప్రశాంతంగా కొనసాగుతుందన్నారు. ఏదైనా సమస్య ఏర్పడితే పోలీస్ సిబ్బంది సహాయం తీసుకోవాలని సూచించారు.

క్రీడలతో ఉల్లాసం : ఎస్సై తాజొద్దీన్

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ



క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, క్రీడల పై యువత ఆసక్తి పెంచుకోవాలని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. బుధవారం మండలంలోని రామ న్నగూడెంలో మహాశివరాత్రి సందర్భంగా కాంగ్రెస్ యూత్ రాష్ట్ర నాయకుడు సూర్య ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ఆయన హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని యువత క్రమశిక్షణతో క్రీడల్లో పాల్గొనాలని అన్నారు. చెడుమార్గాలను వీడి క్రీడల వైపు మొగ్గుచూపాలన్నారు. అనంతరం గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి పదివేలు,రెండవ బహుమతి ఐదువేల రూపాయలను అం దించారు. కార్యక్రమంలో పెద్ది రాజబాబు, గుండెపు రాజు, గద్దెల ప్రణయ్, గద్దెల రామకృష్ణతోపాటు వాజేడు, ఏటూరునాగారం మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.


బాండ్ మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

మొక్కజొన్న పంట వేసిన రైతులు పూర్తిగా నష్టపోయారని ప్రభుత్వం ఆదుకొని వారికి నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రత్నం రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం కన్నాయిగూడెం మండలంలోని కంతనపల్లి, ముహనపల్లి, బుట్టాయిగూడెం, ఏటూరు, చిట్యాల గ్రామాలలో రాజేందర్ మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో కలిసి సమావేశమై ఆయన మాట్లాడుతూ.. రైతులు సింజంట కంపెనీ 601 వెరైటీ బాండ్ మొక్కజొన్న పంట వేయడం వలన సీడ్ ఫెయిల్ అయి రైతులు నష్టపోయారని అన్నారు. బాధజత రైతులకు ఎకరాకు లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించాలన్నారు. బాండ్ విత్తనాల పేరుతో నకిలీ విత్తనాలు సప్లై చేసిన సింజంట కంపెనీ యాజమాన్యంపై, డీలర్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరగకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కావేరి సుధాకర్, రైతు సంఘం నాయకులు కంపెల్లి సురేష్, ఇబ్రహీం పాష, మంచాల రామారావు, బాధిత రైతులు కుడుముల బాబు, కావిరి నాగయ్య, అంజయ్య, బక్కయ్య, రాంబాబు, మహేష్, వెంకటయ్య దుర్గారావు, లక్ష్మీపతి, నందు, దబకట క ష?య్య దామోదర్, మల్లయ్య, సత్యం, సర్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎడ్లపల్లి రఘు బాబు 12వ వర్ధంతి

నవతెలంగాణ- గోవిందరావుపేట



కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీపీ ఎడ్లపల్లి రఘు బాబు 12వ వర్ధంతి సభను మండలంలోని దుంపెల్లి గూడెంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. క్లిష్ట పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా ఉండి పార్టీని కాపాడి తిరిగి మండలంలో పార్టీ నెంబర్ వన్ స్థానంలో నిలిపిన ఘనత రఘు బాబుకే దక్కుతుందని అభిప్రాయపడుతూ హాజరైన నాయకులు కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు. బాబు ఆశయ సాధన కోసం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్య వాణి రాజు నాయక్, పిఏసిఎస్ డైరెక్టర్ సూది రెడ్డి లక్ష్మారెడ్డి, నన్నే బోయినసోమయ్య, కాంపాటి వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ -తాడ్వాయి

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలో, ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, అన్ని వసతులు కల్పించి పూర్తి ఏర్పాట్లు చేసినట్లు స్థానిక మండల ఎన్నికల అధికారి, ఎన్నికల ప్రిసైడింగ్ ఆఫీసర్లు తెలిపారు. మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల సంఖ్య 65 కాగా, ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించినట్లు తెలిపారు. మండలంలోని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, ఏపీఓ దాదాసింగ్, స్థానిక ఎంఆర్ఐ డేగల సాంబయ్య, పోలీస్ కానిస్టేబుల్ పూజారి రమేష్, రెవెన్యూ పంచాయతీరాజ్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

నవతెలంగాణ-గోవిందరావుపేట

మండలంలో నిర్వహించే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లా ఎస్పీ శబరీష ఆదేశాల మేరకు పస్రా సీఐ గద్ద రవీందర్, స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి ఎన్నికల కేంద్రం వద్ద, మండలంలో జాతీయ రహదారిపై భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్నారు. తాడ్వాయి మండలం దట్టమైన అడవీ ప్రాంతంలో ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగానే పటిష్ట చర్యలు చేపట్టారు. పస్రా టూ తాడ్వాయి, తాడ్వాయి టూ ఏటూరునాగారం 163 జాతీయ రహదారిపై అన్ని మోరీలను చిన్నచిన్న బ్రిడ్జిలను ముందస్తు తనిఖీలు నిర్వహించారు. ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు చేరిన సామాగ్రి

నవతెలంగాణ-గణపురం

నేడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా గణపురం మండల కేంద్రంలోని ఎన్నికల బూత్ లోకి బుధవారం ఎన్నికల సామాగ్రి చేరుకుంది. భారీ బందోబస్తు నడుమ ఎన్నికల సామాగ్రిని దించారు. జెడ్పీఎస్-ఎస్ పాఠశాలలో ఒక్క ఎన్నికల బూతును కేటాయించారు. ఇక్కడ 59 ఓట్లు ఉన్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గణపురం ఎస్ఐ రేఖ అశోక్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి : ప్రొసీడింగ్ ఆఫీసర్

నవతెలంగాణ-గోవిందరావుపేట

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బూత్ నెంబర్ 70 ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఎన్నికల ప్రొసీడింగ్ ఆఫీసర్ నవీన్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక పోలింగ్ కేంద్రం బయట మీడియా ప్రశ్నకు సమాధానం ఇస్తూ పోలింగ్ కేంద్రంలో 108 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 67 మంది పురుష ఓటర్లు కాగా 41 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోబోతున్నారని అన్నారు. ఓటింగ్కు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహణ ఉంటుందని అన్నారు. పివో1, ఏపీవో 1 ,ఓపిఓ 2, మైక్రో అబ్జర్వర్ 1 మొత్తం ఐదుగురు ఎన్నికల సిబ్బంది, ఐదుగురు పోలీసు సిబ్బంది పోలింగ్ విధులు నిర్వర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. తహసిల్దార్ సృజన్‌కుమార్ సెక్టార్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ సందర్శన

నవతెలంగాణ-మహదేవపూర్

కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నేడు గురువారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని కాటారం సబ్ కలెక్టర్ మియాసింగ్ తెలిపారు. బుధవారం మహదేవపూర్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఏర్పాట్లు అడిగి తెలుసుకున్నారు. నాలుగు జిల్లాల పరిధిలో మహాదేవపూర్ కాటారం, మహాముత్తారం, మల్హర్, పలిమెల ఐదు మండలాలకు చెందిన మొత్తం ఓటర్లు 2483, ఇందులో పురుషులు 1734మంది, మహిళలు 749 మంది ఓటు హక్కు వినియోగించుకుంటారని అన్నారు. ప్రతి మండల కేంద్రంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మహాదేవపూర్ మండల కేంద్రానికి 610 పట్టభద్రులు, 14 మంది టీచర్లు ఓటు హక్కు వినియోగించుకుంటారని తెలిపారు. తహసీల్దార్ ప్రహ్లద్ రాథోడ్, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఎన్నికల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి దినసరి సూర్య

నవతెలంగాణ -తాడ్వాయి

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, క్రీడల వలన శరీర దారుఢ్యంతోపాటు ఆయురారోగ్యాలు ఉంటాయని, రాష్ట్ర కాంగ్రెస్ యువజన కార్యదర్శి దనసరి సూర్య అన్నారు. బుధవారం మండలంలోని మహాశివరాత్రి సందర్భంగా పంభాపూర్, లింగాల గ్రామాలలో ఏర్పాటుచేసిన వాలీబాల్ క్రీడోత్సవాలకు హాజరై క్రీడాకారులకు బనీన్లు, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ధనసరి సూర్య మాట్లాడుతూ... శివరాత్రి సందర్భంగా యువతకు క్రీడలు నిర్వహించడం ఆనందదాయకం అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తాయన్నారు. అనంతరం గెలిచిన యువకులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆ శివయ్య చల్లని దీవెనలు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, అందరికి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి మండల అధ్యక్షులు బొల్లు దేవేందర్ ముదిరాజ్, మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అరేం లచ్చుపటేల్, మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నాలి కన్నయ్య, కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు ముక్తి రామస్వామి, లింగాల మాజీ ఎంపీటీసీ ఊకె పోతురాజు, మాజీ సర్పంచులు ఇర్ప సునీల్, బెజ్జూరి శ్రీనువాస్, కల్తీ లలితనారాయణ, ఊకె మౌనికనాగేశ్వరరావు, పోలే బోయిన కృష్ణ, మంకిడి నరసింహస్వామి, ఎల్లబోయిన జానకి రాంబాబు, యువ జన కాంగ్రెస్ మండల అధ్యక్షులు కోడి సతీష్, నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఉదయం 8 గంటలకే పోలింగ్ ప్రారంభం



నవతెలంగాణ-జనగామ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధంచేశారు. నేడు గురువారం ఉమ్మడి నల్గొండ-వరంగల్-ఖమ్మం జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నారు. అందుకు అనుకూలంగా జనగామజిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 8 గంటలకే పోలింగ్ ప్రారంభం కానుంది. జనగామ జిల్లాలో మొత్తం 12 పోలింగ్ కేంద్రాల్లో 1,002 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అలాగే ఒక రూట్‌కు మూడు మండలాల చొప్పున నాలుగురూట్‌లను ఏర్పాటు చేశారు. నాలుగు రూట్లకు నలుగురు సెక్టోరియల్ అధికారులను నియమించారు. 17 మంది పీఓలు, 18 మంది ఏపీఓలు, 37 మంది ఓపీఓలు, 18 మంది మైక్రో అబ్జర్వర్ లకు విధులు కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. వీరికి అవసరమైన శిక్షణ కూడా జిల్లా కలెక్టరేట్లో అందించారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు తీసుకొని సిబ్బంది బుధవారం సాయంత్రంకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్‌బాక్సులను జాగ్రత్తగా రిసెప్షన్ కేంద్రాలకు తీసుకువచ్చి అక్కడ నుండి పోలీస్ భద్రతతో బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రాలకు తరలించేందుకు గట్టి బందోబస్తుఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

తప్పిపోయిన మహిళ కుటుంబానికి అప్పగింత

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

సంవత్సరం క్రితం ఇంటి నుండి తప్పిపోయిన జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఓ మహిళను జనగామ సఖి కేంద్రం నిర్వాహకులు ఆమె కుటుంబం వద్దకు చేర్చారు. బుధవారం స్థానిక పోలీసుల సమక్షంలో సదరు మహిళల కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారంరోజుల కింద జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మహిళ జనగామ బస్టాండ్ పరిసరాల్లో ఉంటుందని, తెలియడంతో181 వెహికల్ ద్వారా సఖి కేంద్రానికి తీసుకువచ్చి ఆమెను వెల్కమ్‌కిట్టు అందజేసినట్లు సఖి కేంద్రం ఇంచార్జ్ రేణుక తెలిపారు. బాధిత మహిళతో మాట్లాడితే తాను జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వెస్ట్ సింగ్భూమ్ జిల్లా సోనావా ప్రాంతానికి చెందిన మహిళగా గుర్తించామని, అక్కడి జిల్లా సఖి కేంద్రం వారితో మాట్లాడి విషయం తెలిపామన్నారు. అక్కడి రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో ఈ మహిళకు సంబంధించిన ఫోటోతో కూడిన వివరాలు, జనగామ సఖి కేంద్రం ఫోన్ నెంబర్ కూడా ఆ సోషల్ మీడియాలో ప్రకటించారని, సోషల్ మీడియాలో, ఫేస్‌బుక్ ద్వారా విషయం తెలుసుకున్న మహిళ కుటుంబ సభ్యులు సఖి కేంద్రాన్ని సంప్రదించగా జనగామ పోలీసుల ఆధ్వర్యంలో ఈ మహిళను ఆ కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

ప్రజలకు సేవ చేయడమే ప్రధాన లక్ష్యం

- మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఝాన్సీరెడ్డి



నవతెలంగాణ-పాలకుర్తి

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా నిరంతరం సేవా కార్యక్ర మాల్లో పాల్గొంటు న్నామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించు కుని బుధవారం హనుమాండ్ల ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఝాన్సీరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే ఎనిమిది వేల మందికి మహాఅన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. హనుమండ్ల ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 60వేల మంచినీటి బాటిల్లను భక్తులకు అందించామన్నారు. ప్రతిఒక్కరూ సేవ దక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సేవా కార్యక్రమాలు చేసినప్పుడే ప్రజల్లో ప్రత్యేకగుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లావుడియా మంజుల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామిగౌడ్, కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, దేవస్థాన మాజీచైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి, నాయకులు మారం శ్రీనివాస్, పోగు శ్రీనివాస్, ఎండి మదర్, బొమ్మగాని భాస్కర్ గౌడ్, నలమాస రమేష్ గౌడ్, గోనె మహేందర్ రెడ్డి, చిలువేరు బాలరాజు, కమ్మగాని నాగన్న గౌడ్, పెనుగొండ రమేష్, చిలువేరు సంపత్, లావుడియా భాస్కర్ నాయక్, నునావత్ హరిలాల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు నేడు పోలింగ్



నవతెలంగాణ-పాలకుర్తి

నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పాలకుర్తిలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వంసిద్ధం చేశామని తహసిల్దార్ పొట్టబత్తుల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం తహసిల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ పాలకుర్తి మండలంలో 84 ఉపాధ్యాయుల ఓట్లు ఉన్నాయని తెలిపారు. ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని సిద్ధం చేశామన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లింగారెడ్డి తో పటు పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నీటితొట్టిలో పడి చిన్నారి మృతి



నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

నీటితొట్టిలోపడి చిన్నారి మృతిచెందిన సంఘటన డివిజన్ కేంద్రంలో బుధ వారం చోటు చేసుకుంది. బంధువుల కథనం మేరకు చిల్పూర్ మండలం నష్కల్ గ్రామానికి చెందిన పాశం అపూర్వ, రాజు దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు తనశ్రీ (4) స్టేషన్‌ఘన్‌పూర్‌లో తన అమ్మమ్మ ఇంటికి వచ్చిన చిన్నారి మధ్యాహ్నం సమయంలో ఆడుకుంటూ నేరుగా నీటికోసంవెళ్లి, తొట్టిలో పడినట్లు బంధువులు, స్థానికులు తెలిపారు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఎంపీడీవోను అడ్డుకున్న పోలీసులు

నవతెలంగాణ-పాలకుర్తి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా విధులకు హాజరయ్యేందుకు వెళుతున పాలకుర్తి ఎంపీడీవో రాములు ను పోలీసులు బుధవారం అడ్డుకున్నారు. పాలకుర్తి పంచాయతీ కార్యదర్శి తో పాటు ఇతర కార్యదర్శులతో తన వాహనంలో వస్తున్న ఎంపీడీవోను వెలుగు పాఠశాల ప్రహరీ గోడ వద్ద ఉన్న పోలీసులు అరగంట పాటు వాహనం వెళ్లకుండా నిలిపివేశారు. పోలీసులకు ఎంపీడీవోకు వాగ్వాదం జరిగింది. విధులకు వెళ్లాలని వాదించినప్పటికీ పోలీసులు అనుమతించలేదు. ఎంపీడీవోను అడ్డుకున్నారన్న సమాచారాన్ని తెలుసుకున్న సీఐ గట్ల మహేందర్ రెడ్డి, ఎస్సై దూలం పవన్ కుమార్ లు ఎంపీడీవోను వెళ్లేందుకు ఆదేశాలు జారీ చేయడంతో పోలీసులు అనుమతించారు. శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకునేందుకు పోలీసులు తమ బంధువులతో గుట్ట పైకి వెళ్లేందుకు ఎత్తించడంతో విమర్శలకు దారితీసింది. సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల సమీపంలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ వద్ద విద్యుత్ సిబ్బందికి పోలీసులకు మధ్య గొడవ జరిగింది.

విద్యుత్ సిబ్బంది తమ కార్యాలయం నుండి తెచ్చుకున్న కుర్చీలను పోలీసులు కోపంతో కిందపడేసారని, విద్యుత్ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించడంతో విద్యుత్ శాఖ ఏఈకి విద్యుత్ సిబ్బంది సమాచారాన్ని అందించారు. విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని సంకేతాలు ఇవ్వడంతో అప్రమత్తమైన పోలీసులు జాతర నిర్వహణకు సమన్వయంతో పని చయాలని సూచించారు.



ఉపఎన్నిక వస్తే బీఆర్ఎస్ రాజయ్యకు టిక్కెట్టు ఇస్తుందా..?




నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

ఉపఎన్నికలు రావని ఒకవేళవస్తే బీఆర్ఎస్ నుండి డాక్టర్ రాజయ్యకు టిక్కెట్టు ఇచ్చేదమ్ము కేటీఆర్‌కు ఉందా ? అని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బెలిదే వెంకన్న ప్రశ్నించారు. బుధవారం నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ భవన్ లో జరిగిన బీఆర్ఎస్ చేరికలు అంతా ఉత్తమాటే అని విమర్శించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి గాలిలో గెలిచారనడం హస్యాస్పదమని అన్నారు. గాలికి ఎదురునిలిచి గెలిచారని వివరించారు. బీఆర్ఎస్ గాలి ఉంటే గనుక రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ఎలా గెలిచిందని అన్నారు. నియోజక వర్గ ప్రజలు కడియం వెంటే ఉన్నారని, కడియం ప్రజల కోసం పరితపించే వ్యక్తని పేర్కొన్నారు. ఆపార్టీలో ఉన్నవారికే మరలా ఆపార్టీ కండువా కప్పి, బీఆర్ఎస్ లోకి చేరారని చెప్పుకోవడం, బీఆర్ఎస్ దివాళాకోరు రాజకీయానికి నిదర్శనమన్నారు. ఈకార్యక్రమంలో అంబటి కిషన్ రాజు, జీడి రమేష్, పల్లె రవీందర్, చట్ల సత్యనారాయణ, కుమారస్వామి, జీడి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ... శంభోశంకర







నవతెలంగాణ-పాలకుర్తి

హర హర మహాదేవ శంభో శంకర అంటూ శివనామ స్మరణంతో హరిహరుల దివ్య క్షేత్రం శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయం మారుమ్రోగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. బుధవారం అర్ధరాత్రి నుండి ప్రారంభమైన అభిషేకాలతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తుల తాకిడి పెరిగింది. స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయ అధికారులు గర్భిణి స్త్రీలు, వద్ధులు, వికలాంగుల కోసం ఉచిత వాహనాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిటకిటలాడింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్ పర్యవేక్షణలో వర్ధన్నపేట ఏసిపి అంబటి నరసయ్య ఆధ్వర్యంలో సిఐలు గట్ల మహేందర్ రెడ్డి, శ్రీనివాస రావులు, ఎస్ఐలు దూలం పవన్ కుమార్, లింగారెడ్డి, యాకోబు హుస్సేన్, రాజు, సజన్ కుమార్, బండి శ్రావణ్, శ్రావణ్ ల తో కలిసి భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు కొండపైకి ప్రైవేటు వాహనాలను అనుమతించలేదు.

జాతరలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా స్టేషన్ ఘన్పూర్ ఆర్డీవో డిఎస్ వెంకన్న నేతత్వంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డి ఆర్ డి ఓ పి డ వసంత, డిపిఓ స్వరూప, సిఎఫ్ఓ లక్ష్మీ ప్రసన్న లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో డాక్టర్ సిద్ధార్థ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. మెట్ల మార్గంలో స్వామివారిని దర్శించుకునేందుకు వెళ్లిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఎన్సిసి వాలంటీర్లు బందోబస్తులో పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల సందర్భంగా జాతరలో రూ.30లకే కొబ్బరికాయ విక్రయించాలని ఆలయ అధికారులు బ్యానర్ ఏర్పాటు చేసినప్పటికీ విక్రయించే టెండర్ దారు యధేచ్ఛగా రూ.50లకు విక్రయించడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొబ్బరికాయలపై రూ.20లు అదనంగా వసూలు చేస్తున్నప్పటికీ ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు ఆరోపించారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా స్టేషన్ ఘన్పూర్ రాంబాబు, ఏడిఏ శ్రీనివాస్, ఏఈ ఆవిరినేని రణధీర్, బోయని సత్తయ్య లు నివారణ చర్యలు చేపట్టేందుకు సిబ్బందిని అప్రమత్తం చేశారు. రెండు 63 కెవి జనరేటర్ లను ఏర్పాటు చేసుకున్నారు. త్రాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్డబ్ల్యూఎస్ డీఈ సంధ్య, ఏఈ ప్రశాంతిలు ప్రజలకు త్రాగునీరు అందుబాటులో ఉండే విధంగా నీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు. జాతరలో పరిశుభ్రతను పాటించేందుకు పరిశుద్ధ కార్మికులు నిరంతరం శ్రమించారు. బ్రహ్మోత్సవాల విజయవంతానికి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. వివిధ జిల్లాల నుండి భక్తులు సోమేశ్వర లక్ష్మీ నరసింహ స్వామని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సల్వాది మోహన్ బాబు, ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య తోపాటు ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు..

జనగామ : జనగామలో అత్యంత వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. ప్రజలు భక్తి పారవశ్యంగా పూజలు నిర్వహించారు. అత్యంత ప్రధానంగా నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాల జిల్లాలోని శివాలయాలని కిటకిటలాడాయి. ప్రధానంగా జనగామ సమీపంలోనే శ్రీ పంచ కోసుల రామలింగేశ్వర స్వామి చిటకోడు దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మహాశివరాత్రి సందర్భంగా ఈ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

స్టేషన్‌ఘన్‌పూర్ : నియోజకవర్గ పరిధిలో శైవక్షేత్రాలు ఎక్కడ చూసినా శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామున నుంచే పెద్ద ఎత్తున భక్తులు కాలువల్లో పుణ్య స్నానాలు ఆచరించారు.సమీపంలో గల శైవ క్షేత్రాలకు వెళ్లి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.ముఖ్యంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామంలో శివాలయంలో చిల్పూర్ గుట్ట దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు కిరణ్మయి దంపతుల చేతుల మీదుగా శివాలయ సంప్రోక్షణ, శిఖర కలశ స్థాపన పంచామత అభిషేకం జరిపించారు. అర్చకులు రాం బ్రహ్మాచార్యులు, రంగాచార్యులు, రవీందర్ శర్మ, ఆంజనేయులు, ప్రత్యేక మంత్రోచ్చరణలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిర్ర నాగరాజు, ఎలగందుల రత్నాకర్ రెడ్డి, నర్సింహరెడ్డి, పసునూరి వెంకట్ రెడ్డి, బత్తిని శ్రీను, రాజు, అశోక్ పాల్, రఘుపతి, వెంకటస్వామి, అశోక్, రవి, కోటి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని ఇప్పగూడెంలో ప్రసిద్ధిగాంచిన స్వయంభూ క్షేత్రమైన శివాలయంలో తెల్లవారుజామునుండే విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. నాయకులు మంథపురం ఎల్లాగౌడ్, కవిత దంపతులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు.తెల్లవారుజామున నుండే స్వామి వారి దర్శనం కోసం శివాలయం నందు బారులు తీరారు. వేలాది సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. మరో ప్రక్క ఓం కార నాదంతో శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగించారు.

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

కొడకండ్ల : మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాల తోపాటు మండల కేంద్రంలో శివాలయాల్లో శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శివపార్వతుల కళ్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి.

మచ్చుపహాడ్ నాయిని గుట్టపై జాతర ప్రారంభం

నర్మెట్ట : మహా శివరాత్రి పురస్కరించుకుని ప్రసిద్ధిగాంచిన మచ్చుపహాడ్ నాయిని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రికి రోజున నాయిని వేంకటేశ్వరస్వామి కల్యాణం, సామూహిక పంచామత అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 27, 28 జాతరను నిర్వహిస్తారు. కమిటీ ఆధ్వర్యంలో 27న అర్చనలు, 28న వనభోజనాలు నిర్వహిస్తున్నామన్నారు. నాయిని వేంకటేశ్వర ఆలయానికి మండలకేంద్రానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న మచ్చుపహాడ్ గుట్టపై సూమారు 500 మీటర్ల ఎత్తుపై శ్రీనాయిని వేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. జరత సమయాల్లో నర్మెట్ట మండల రఘునాథ్ పల్లి , చిల్పూర్ మండల ప్రజలు సుమారుగా 12000 వేల మంది ధర్శనం చేసుకుంటారని అన్నారు. నాయిని గుట్ట పై నిత్యం జలధార కలిగి దేవతలు సంచరించిన ప్రదేశంగా పేరుగాంచింది. నాయిని వేంకటేశ్వర్వస్వామిని దర్శించుకున్న భక్తులకు మోక్షం పుణ్యప్రాప్తి కలుగతుందని ఇక్కడి నమ్ముకుంటారు. ఈ కార్యక్రమంలో . మచ్చు పహాడ్ మాజీ సర్పంచ్ రామిని శివరాజు, గొల్లపల్లి కుమారస్వామి, పెద్దిరాజి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ కార్యదర్శి లింగరాజు గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బుర్ర నరేష్, జడల రమేష్, జయరాం నాయక్ బాల్ చందర్ గౌడ్, యువజన నాయకులు, అర్చకులు నాగ నాగభూషణం శర్మ , యువజన నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శివపూజ అభిషేకాలు

మండలంలోని నర్మెట్ట మచ్చుపహాడ్ అమ్మాపురం, వెల్దండ, హనుమంతపూర్ గ్రామాల్లో ఘనంగా శివాలయాల్లో పూజలతో అభిషేకాలతో ఆయా గ్రామాల భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఎంత భక్తి శ్రద్ధలతో ఉపవాసాలు జాగారాలు భక్తులు శివస్మరణతో శివాలయాలు కిక్కిరిసినాయి ఈ కార్యక్రమంలో పూజారి నాగభూషణం శర్మ పలు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.









ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జనగామ జిల్లా పరిధిలో వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. గురువారం ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్న నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని అందుకొని, వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సురక్షితంగా తరలివెళ్లారు. ఈ ప్రక్రియని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్వయం గా పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియపై కలెక్టర్ సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 'ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు కఠిన చర్యలు తీసుకున్నామన్నారు. పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకుని విధులను నిర్వర్తించాలన్నారు. ఓటింగ్ గోప్యతను ఖచ్చితంగా పాటించాలన్నారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలోని ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన ఆయన, తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు వంటి అన్ని వసతులు సమర్థంగా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

కమనీయం శివపార్వతుల కళ్యాణం

పట్టువస్త్రాలు తలంబ్రాలు సమర్పించిన అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్





నవతెలంగాణ-పాలకుర్తి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బుధవారం రాత్రి ఆలయ కళ్యాణ మండపంలో శివపార్వ తుల కళ్యాణం కమనీయంగా, కన్నుల పండుగగా జరిగింది. శివపార్వతుల కళ్యాణానికి జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్, స్టేషన్ఘన్పూర్ ఆర్డీఓ డిఎస్.వెంకన్న, ఆలయ ఈవో సల్వాది మోహన్‌బాబు పట్టు వస్త్రాలతో పాటు తలంబ్రాలను భాజ భజంత్రీలతో వేద పండితుల మంత్రోత్సవాలతో తీసుకొచ్చారు. తాటిపాముల నరసింహమూర్తిశర్మ ఆధ్వర్యంలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, సిఎఫ్ఓ లక్ష్మీప్రసన్న పర్యవేక్షణలో కమనీయం, రమనీయంగా జరిగిన శివపార్వతుల కళ్యాణానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పాల్గొన్నారు. శివపార్వతుల కళ్యాణ



కార్యక్రమానికి పాలకుర్తి మార్కెట్ చైర్ పర్సన్ లావుడియా మంజుల భాస్కర్ నాయక్, తొర్రూర్ మార్కెట్ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామిగౌడ్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం : ఝాన్సీ రెడ్డి



నవతెలంగాణ-పాలకుర్తి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఐలమ్మ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ లావుడియా మంజులతో కలిసి ఝాన్సీ రెడ్డి ఆటోలో ఘాట్ రోడ్డు మార్గాన వెళ్లి శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహ సమిని దర్శించుకుని అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ ఆలయాన్ని అందరంగాలు అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విరగని కుమారస్వామి గౌడ్, కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, దేవస్థాన మాజీ చైర్మన్ చిలువేరు కష్ణమూర్తి, నాయకులు మారం శ్రీనివాస్, వీరమనేని యాకాంతారావు,మదర్, లావుడియా భాస్కర్ నాయక్, బొమ్మగాని భాస్కర్ గౌడ్, చిలువేరు బాలరాజు, చిలువేరు సంపత్, కమ్మగాని నాగన్న గౌడ్, పెనుగొండ రమేష్ నాయకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-పాలకుర్తి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించు కుని బుధవారం శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మాజీ మత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలోనే ఆలయాన్ని అభివద్ధి చేశామన్నారు. ఆలయ అభివద్ధి కోసం పెండింగ్ పనులను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పుస్కూరి శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, నాయకులు జరుపుల బాలు నాయక్, దొంతమల్ల గణేష్, కారుపోతుల వేణు, కమ్మగాని నాగన్న గౌడ్ తో పటు కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
మహబూబాబాద్
గురువారం | ఫిబ్రవరి 27, 2025 | www.navatelangana.com

శివాలయంలో ఘనంగా..శివరాత్రి వేడుకలు..

నవతెలంగాణ-బయ్యారం:



మహాశివరాత్రి సందర్భంగా మండల కేంద్రంలోని శివాలయంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పుణ్యస్నానం ఆచరించి పరమశివుని దర్శనం కోసం ప్రజలు బారులు తీరారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాలు విద్యుత్ కాంతులతో వెలుగుతున్నాయి. శివనామస్మరణలతో శివాలయాలు మారుమోగిపోయాయి. మండల కేంద్రంలోని శివాలయంతో పాటు, లింగమంతుల ఆలయంలో, కోటగడ్డ గ్రామంలోని శివాలయంలో మహాశివరాత్రి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

ఎన్నికల సామాగ్రి పంపిణీ

- పంపిణీ ప్రక్రియను పరిశీలించిన ఎన్నికల అధికారి, కలెక్టర్

నవతెలంగాణ-మహబూబాబాద్



నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని ఫాతిమా హైస్కూల్ నుండి జిల్లాలోని 16 కేంద్రాలకు సంబంధించి ఎన్నికల సామాగ్రి పంపిణీ చేయడం జరిగింది. ఈసందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉన్నామన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మచారి, మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజన్ అధికారులు కె.కృష్ణవేణి, జి.గణేష్, ఎన్నికల నోడల్ అధికారులు, సెక్టోరల్ అధికారులు తదితరులు ఉన్నారు.

అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పోదెం వీరయ్యకు సన్మానం

నవతెలంగాణ-గూడూరు



మండలంలోని మట్వాడ గ్రామానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పోదెం వీరయ్య ను మట్వాడ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాసం వీరస్వామి ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మట్వాడ గ్రామంలో ఉన్నటువంటి సమస్యలను తన దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా ఈ గ్రామంలో అటవీ భూములకు విద్యుత్ సరఫరా అందించాలని, అటవీ హక్కు పత్రాలు రాని రైతులకు హక్కు పత్రాలు కల్పించాలని, మట్వాడ నుంచి నేలవంచ గ్రామానికి రహదారి నిర్మాణం కొరకు అటవీశాఖ అనుమతులు వచ్చేలా చూడాలని, హక్కు పత్రాలు కలిగిన రైతులకు బ్యాంకుల నుంచి రుణాలు వచ్చేలా చూడాలని ఈ సందర్భంగా అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌కువినతి పత్రం అందజేశారు. ఈ అంశాలపై చైర్మన్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలకు పరిష్కారం చూపిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ రేగ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ వాసం సమ్మయ్య హనుమతండా ఉపసర్పంచ్ అజ్మీర రమేష్, గుగ్గిర్ల పీరయ్య, న్యాయవాది వాసం ఆనంద్‌కుమార్, రేగ వజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా.. మహాశివరాత్రి వేడుకలు..

- శివనామస్మరణతో మారు మోగిన శివాలయాలు
- చిన్నవంగరలోని మల్లికార్జున స్వామి ఆలయంలో..
- ఎర్రబెల్లి ప్రత్యేక పూజలు..

నవతెలంగాణ-పెద్దవంగర:



శివ నామస్మరణతో పెద్దవంగర మండలం మారుమోగింది. బుధవారం మహాశివరాత్రి కావ డంతో మండల వ్యాప్తంగా ప్రజలు మహాశివరాత్రి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని శివాలయాలు ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల ఎదుట భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు. పెద్దవంగర గ్రామంలోని పార్వతి రామలింగేశ్వర స్వామి, చిన్నవంగర లోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయాల్లో భక్తజనసంద్రంగా మారింది. వందల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మల్లికార్జున స్వామి ఆలయంలో ఎర్రబెల్లి పూజలు

చిన్నవంగర గ్రామంలోని పురాతన శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేయడం పట్ల వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో పాకనాటి లక్ష్మారెడ్డి, ముద్దసాని పుల్లారెడ్డి, పాకనాటి అజిత్ రెడ్డి, పాకనాటి సునీల్‌రెడ్డి, పాకనాటి శేఖర్, విజయ్‌పాల్‌రెడ్డి, నగేష్, ఈదురు ఐలయ్య, శ్రీరాం సంజయ్, శ్రీరాం సుధీర్, రాము, యాకయ్య, శివరాత్రి సోమనర్సు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా.. గంగమ్మ జాతర..

నవతెలంగాణ-గూడూరు



గంగారం మండల కేంద్రంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీశ్రీ శ్రీ గంగమ్మ అమ్మవారి జాతర ఆదివాసి సాంప్రదాయాల మధ్య జాతర కొనసాగుతుంది గత ఆదివారం జాతర ప్రారంభమై సోమవారం గంగమ్మ స్నానం కార్యక్రమం, మంగళవారం మొక్కులు సమర్పించుట బుధవారం అమ్మవారి ఊరేగించుట, తలంబ్రాల కార్యక్రమం నిర్వహించారు మండల కేంద్రంలో గుట్టపై కొలువుదీరిన గంగమ్మ దేవతను దర్శించుకొనుటకు వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు ఈకార్యక్రమంలో ప్రధాన శివసత్తులు శ్రీబెజ్జరి లక్ష్మీనరసింహ, పూజారి చింత రవి, బెజ్జరి మల్లయ్య, బెజ్జరి విజయ్, బెజ్జరి రాము, బుల్లి ముత్తయ్య ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు

శివనామస్మరణతో మారు మోగిన శివాలయాలు

నవతెలంగాణ-గార్ల:



శివరాత్రి పర్వదినాన్ని పుంస్కరించుకొని మండలంలోని పలు గ్రామాలలో ఉన్న శివాల యాలలో బుధవారం భక్తులు ఉదయం నుండే ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అభి షేకాలు చేపట్టారు. మండల కేంద్రంలోని కంత మహేశ్వర స్వామి ఆలయం గౌడ కులస్తుల అధ్వర్యంలో మహిళలు బోనాలతో ప్రదర్శన నిర్వహించి కంత మహేశ్వర స్వామి కి నైవేద్యాలు సమర్పించారు. స్దానిక శివాలయంలో, పుల్లూరు సమీపంలో ఉన్న శివాలయంతో పాటు, మర్రిగూడెం లోని శ్రీవేట వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శివాలయంలో భక్తులు, మహిళలు శివపార్వతులకు పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. శివరాత్రి పండుగ సందర్భంగా అయా ఆలయాలు శివ నామస్మరణతో మారుమోగాయి.

సర్వాంగ సుందరం.. గుండం శివాలయం..

నవతెలంగాణ-కొత్తగూడ



మహాశివరాత్రి పండుగ పురస్కరించుకొని గుండం శివాలయాన్ని సర్వంగ సుందరంగా అలంకరించారు. పాకాల అడవులలో ప్రసిద్ధి చెందిన గుండం చెరువు ఒడ్డున 12 శతాబ్దంలో కాకతీయ రాజులు శ్రీగణపతి దేవుడు నిర్మించిన శైవ క్షేత్రం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం (రామక్క తీర్థం) కాకతీయులశైలి అప్పటి కాలంలో శివలింగంపై పడిన పాలు నీరు క్రింద ఆత్మలింగంపై పడి సొరంగం మార్గం ద్వారా గుండం చెరువులో కలుస్తుంది. గుండం చెరువులో స్నానం చేయడం వలన పవిత్రులైతున్నారు పుణ్యప్రదం కలుగుతుంది. పూర్వకాలం ఈశివాలయం చుట్టూ ఆదివాసి గిరిజనులు నివసించేవారు. అందులో దంపతులు మహాశివరాత్రి పర్వదినాన గుండం చెరువుల స్నానం చేసి శివ పూజ చేయడం వలన సంతానం కలిగింది. పండంటి ఆడబిడ్డ కార్తీక పౌర్ణమి రోజు జన్మించింది. ఆమెకు రామక్క అని నామకరణం చేశారు. రామక్క పెరిగి పెద్దదై ఈ యొక్క ఆలయానికి సంరక్షించడం వలన శివుడు రామక్క సేవా భక్తికి ముగ్ధుడై వరం ప్రసాదించాడు. రామక్క పేరుమీదనే ఈయొక్క క్షేత్రం వెలిసిల్లుతుందని శివుడు వరం ప్రసాదించాడు. ఈపురాతన ప్రాచీన శివాలయం దర్శించినా, స్మరించాన, అభిషేకించిన వారికి సప్త జన్మ పుణ్యఫలం కలుగుతుందని భక్తుల విశ్వాసం. ప్రతి సంవత్సరం ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని శివుని అనుగ్రహం పొందుతారు.

రైతు రుణమాఫీతో కొత్త చరిత్ర సృష్టించాం..

- ఆగ్రో రైతు సేవా కేంద్రం ప్రారంభోత్సవంలో ..
- పభుత్వ విప్ డాక్టర్ జాటోతు రామచంద్రునాయక్

నవతెలంగాణ-మరిపెడ

తెలంగాణ రాష్ట్రంలో ఏడాదికి రైతు సంక్షేమానికి రూ.54 వేల కోట్లు కేటాయించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని, రూ.21 వేల కోట్లతో 25 లక్షల మంది రైతులకు రైతు రుణమాఫీ చేసి దేశంలోనే చరిత్ర సృష్టించామని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రామచంద్రునాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తానంచర్ల గ్రామంలో ఆగ్రోరైతు సేవా కేంద్రాన్ని బుధవారం డాక్టర్ ప్రమీలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా రామచంద్రునాయక్ మాట్లాడుతూ రైతులకు నాలుగో విడత రుణమాఫీ వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న మూడు విడతలుగా పంచిన రూ.2 లక్షల రైతు రుణమాఫీ రూ.2 లక్షల 747 కోట్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేశారని తెలిపారు. దీంతో మూడు లక్షల 12 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరిందని రామచంద్రునాయక్ స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్ముకున్న రైతులకు క్వింటాకు రూ.500 బోనస్



ఇచ్చామని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు చేయటంలో నిర్లక్ష్యం చేశారని, ఆనాడు ధాన్యం అమ్మిన రైతులకు సరైన సమయానికి డబ్బులు రాక నానా అవస్థలు పడ్డ పరిస్థితులు ఉన్నాయని విమర్శించారు. రైతులకు ఇచ్చిన మాట కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. అంతేగాక ఏడాది కాలంలో 55 వేల మంది నిరుద్యోగులకు కొత్త ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఉద్యోగులకు ప్రతి నెలానెలా జీతాలు చెల్లిస్తున్నామన్నారు. ఎంతోమంది పేదలకు రేషన్ కార్డులు పంపిణీ చేయకుండా నియంతగా కేసీఆర్ పాలించారని, వేలాదిమంది నిరుపేదలకు నెలానెలా బియ్యం రాకుండా పోయిందన్నారు. వారం పది రోజులలో రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుడతామన్నారు. ఆగ్రో రైతు సేవా కేంద్రం నిర్వాహకులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరారు. రైతు ఆగ్రో సేవా కేంద్రం నిర్వాహకులు సబ్సిడీ ద్వారా అందిస్తున్న వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్లి రఘువీరారెడ్డి, జిల్లా నాయకులు ఒంటి కొమ్ము యుగంధర్‌రెడ్డి, నూకల అభినవ్‌రెడ్డి, కాలం రవీందర్ రెడ్డి, పానుగోత్ రామ్‌లాల్, మేంచు అశోక్, గంధసిరి అంబరీష, నాయకులు పురుషోత్తమరెడ్డి, గుగులోత్ రమేష్‌నాయక్, పాశం నరేష్‌రెడ్డి, గూగులోతు రవి నాయక్, కంది బండ ప్రసాద్, మూలమర్రి తండా గ్రామ మాజీ సర్పంచ్ తేజావాత్ జగిని లాలూనాయక్, ఆగ్రో రైతు సేవా కేంద్రం ప్రేపరేటర్ తేజావత్ భరత్ కుమార్, ప్రవీణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

ధరల చదరంగంలో.. దగాపడ్డ రైతులు...!





- మిర్చి ధర లేక రైతన్నలు గుబేలు
- కూలీల కొరత.. అధిక పెట్టుబడులు..

నవతెలంగాణ-బయ్యారం:

ధరల చదరంగంలో మిర్చి రైతులు నిలువునా దగా పడ్డారు. వ్యాపారులు కాచుకొని కూర్చున్నారు. అదును చూసి దెబ్బకొట్టారు. గత సంవత్సరం ఇదే సీజన్‌లో క్వింటాకు రూ.22 వేల చొప్పున వెచ్చించిన ఖరీదుదారులు, ఈ ఏడాది సీజన్ నాటికి ధరలను అమాంతం తగ్గించారు. ఖరీదు దారుల వ్యూహానికి ధరలు నేల చూపులు చూస్తుండడంతో ఎర్ర బంగారం రైతులు బోరుమంటున్నారు. గత సంవత్సరం క్వింటా మిర్చిని రూ.22 వేల నుంచి రూ.23 వేల మధ్య కొనుగోలు చేయడంతో అన్నదాతలు ఈపంట సాగుకు ఆశలు పెంచుకున్నారు. ఈధర మరికొంత పెరుగుతుందేమోనని కొందరు రైతులు కోల్డ్ స్టోరేజీల్లో భద్రపర్చుకున్నారు. ఇప్పుడు ధరలు దారుణంగా తగ్గడంతో నెత్తినోరూ బాదుకుంటున్నారు. గత సీజన్ వరకు మిర్చి ధర రూ.21 వేలకు పైగా పలికింది. అయితే సడెన్‌గా 13 వేలకు పడిపోవడం రైతులకు షాకిచ్చింది. అంతేకాదు క్వాలిటీ లేదంటూ కొన్ని చోట్ల తాలి కోత కాయ కూడా రూ.10 వేలు నుంచి 12 వేలకే అడుగుతున్నారు. దాంతో మహమ్మారి తెగుళ్ల నుంచి పంటను కాపాడుకున్న మిర్చి రైతులు లబోదిబోమంటున్నారు. ధర పతనంతో ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు సుమారుగా రూ.లక్ష పైగా పెట్టుబడి పెట్టారు. స్థానికంగా కూలీల కొరత ఏర్పడటంతో ఇతర రాష్ట్రాల నుంచి వాహనాల్లో కూలీలను తెప్పించుకొని మరీ మిర్చి పంటలు కోశారు. మిర్చి తోటల వద్ద కూలీలకు అన్ని సౌకర్యాలూ కల్పించారు. ఇలా మిర్చి కోతలకే ఎకరానికి సుమారు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. కాని ఇంతలా శ్రమించి మిర్చిని కోసి మార్కెట్‌కు తీసుకెళ్తే ధరలు మాత్రం దారుణంగా పతనమై కనిపిస్తున్నాయి. నాణ్యతను బట్టి బహిరంగ మార్కెట్‌లో క్వింటా మిర్చి ధర రూ.10 వేల నుంచి రూ.14 వేల వరకు మాత్రమే పలుకుతోంది. దీంతో మిర్చి రైతుకు కంటతడి తప్ప మరేమీ లేకుండా పోతోంది. మరుసటి ఏడాది వరకూ కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచుదామంటే ఇప్పుడు పెట్టుబడులు తీరే మార్గం కన్పించడం లేదు. పైగా గత సంవత్సరం అనుభవం దృష్ట్యా అప్పటి ధర ఎలా ఉంటుందోనన్న అనుమానాలు వెంటాడుతున్నాయి. దీంతో కొందరు రైతులు ఇదే ధరలకు తెగనమ్ముకుంటుండగా, మరికొందరు రైతులు మాత్రం తమ పంటను కల్లాల్లోనే నిల్వ ఉంచుకొని ధరల పెరుగుదల కోసం ఎదురుచూస్తున్నారు. ఈసందర్భంగా మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ.13 వేల ధరతో మిరప రైతులకు పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి నెలకొంది. వెంటనే పంటలకు మద్దతు ధరలు కల్పించాలని, లేని పక్షంలో రైతులు పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు.

మిర్చికి మద్దతు ధర ప్రకటించాలి




ప్రభుత్వం మిర్చికి మద్దతు ధర రూ.25 వేలు ప్రకటించి మిర్చి రైతులను ఆదుకోవాలి. ఈసంవత్సరం ధరల చదరంగంలో మిర్చి రైతు పూర్తిగా నష్టపోయారు. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాని దుస్థితి నెలకొంది. దిక్కుతోచని స్థితిలో మిర్చి రైతన్న కొట్టుమిట్టాడుతున్నారు. మిర్చికి ప్రభుత్వం తక్షణమే మద్దతు ధర ప్రకటించాలి.

-కొల్లా వెంకటేశ్వర్లు, మిర్చి రైతు

అడ్డంకులు తొలగిపోయేనా..?

- నత్తనడకన రహదారి విస్తరణ పనులు
- నిధుల కొరతతో ఆలస్యం..
- సామాన్యులకు, వ్యాపారులకు తప్పని ఇబ్బందులు

నవతెలంగాణ-తొర్రూర్



'దేవుడు వరం ఇచ్చినా పూజారి కరుణించడం లేదన్న' చందంగా మారింది తొర్రూరు పట్టణంలోని రహదారి విస్తరణ, మెగా డ్రైనేజీ నిర్మాణం పనుల తీరు. కొద్ది నెలలుగా సాగుతున్న అభివృద్ధి పనులకు నిధుల కొరత అడ్డుపడడంతో పరిస్థితి తీవ్రంగా మారుతుంది. గత ప్రభుత్వ హయాంలో సెంట్రల్ లైటింగ్, రహదారి విస్తరణ, మెగా డ్రైనేజీ నిర్మాణాలకు సుమారు రూ.10 కోట్ల నిధులు మంజూరు కాగా ఈ నిధులతో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో పాల కేంద్రం నుండి దుబ్బ తండా వరకు సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఇరువైపులా డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్, డివైడర్ల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈపనులను మున్సిపల్ శాఖ పర్యవేక్షిస్తుండగా కాంట్రాక్టర్ పనులు నిర్వహిస్తున్నారు. గత ఆరు నెలలుగా కొనసాగుతున్న ఈపనులకు ఆది నుంచి అడ్డంకులే ఎదురవుతున్నాయి. ఈఅడ్డంకులతో రహదారి విస్తరణ, డ్రైనేజీ నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. దీంతో సామాన్యులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.

నిధుల కొరతతో ఆలస్యమా..?

రోడ్డు విస్తరణ, డ్రైనేజీ నిర్మాణాల పనులు సాగుతున్న క్రమంలో రహదారికి ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించే పనులు చేపట్టాలని స్థానిక మున్సిపల్ శాఖ, విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు. దాంతో తొలగించాల్సిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించేందుకు రెండు శాఖల అధికారులు కలిసి ఉమ్మడి సర్వే చేపట్టారు. ఈసర్వే లెక్కల ప్రకారం పట్టణ మేయిన్ రోడ్డు లో ఇరువైపులా విద్యుత్ స్తంభాలు ఒకవైపు 127 విద్యుత్ స్తంభాలు, పది ట్రాన్స్‌ఫార్మర్లు వీటి తొలగింపుకు రూ.63 లక్షల 89 వేల 696లు, అలాగే రోడ్డుకు మరోవైపు 144 విద్యుత్ స్తంభాలు, ఆరు ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని గుర్తించారు. వీటిని తొలగించేందుకు రూ.62 లక్షల 993లతో విద్యుత్ శాఖ అధికారులు ఎస్టిమేషన్ వేసి మున్సిపల్ శాఖ అధికారులకు అందజేశారు. ఈమొత్తం నిధులు మున్సిపల్ శాఖ అధికారులు ట్రాన్స్‌కోకు చెల్లిస్తే విద్యుత్ శాఖ అధికారులు అడ్డుగా ఉన్న వాటిని షిఫ్టింగ్ చేస్తారు. ఈప్రక్రియ పూర్తి అయితేనే అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను షిఫ్టింగ్ చేసే పనులను చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనా త్వరితగతిన పనులు పూర్తి చేస్తే పట్టణ ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

ఎస్టిమేషన్ వేసి పంపించాం



తొర్రూరు పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ, మెగా డ్రైనేజీ పనుల వల్ల రోడ్డుకు ఇరువైపులా తొలగించాల్సిన 271 విద్యుత్ స్తంభాలు, 16 ట్రాన్స్‌ఫార్మర్ల తొలగింపుకు గాను రూ.కోటి 25 లక్షల 90 వేల 689 ఎస్టిమేషన్ వేసి మున్సిపల్ అధికారులకు అందజేశాం. మున్సిపల్ శాఖ వారు ట్రాన్స్‌కోకు చెల్లిస్తే తప్ప తొలగించలేం.

-సీఎస్ చలపతిరావు, ఏడీ విద్యుత్ శాఖ

నిధులు మంజూరీ కాగానే చెల్లిస్తాం.




విద్యుత్ శాఖ అధికారులు ఎస్టిమేషన్ వేసి ఇచ్చినారు. మున్సిపాలిటీలో అన్ని నిధులు లేనందున, నిధులు మంజూరి చేయించాలని స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినీ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాం. నిధులు మంజూరీ కాగానే ట్రాన్స్‌కోకు చెల్లిస్తాం.

-పి.శాంతి కుమార్, మున్సిపల్ కమిషనర్

మారుమోగిన శివాలయాలు..!

- మరిపెడ, అబ్బాయిపాలెం దేవస్థానంలో.. దర్శించుకున్న విప్ రామచంద్రు నాయక్

నవతెలంగాణ-మరిపెడ



మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా మరిపెడ మండలంలోని అబ్బాయిపాలెం అగస్తేశ్వర స్వామి ఆలయం, మున్సిపాలిటీలో పరిధిలో మరిపెడ శివాలయాన్ని ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్ ఆయన సతీమణి డాక్టర్ ప్రమీలలు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారివెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్లి రఘువీరారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చేపల యాదగిరి రెడ్డి, నూకల అభినవ్‌రెడ్డి, పానుగోత్ రామ్‌లాల్, గంధసిరి అంబరీష, అశోక్, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గుండగాని వేణు, అలువాల ఉపేందర్, రాయల రవి, అలవాల శ్రీనివాస్, పూజారి ప్రసాద్ శర్మ, తదితరులు ఉన్నారు. జాతరలో భక్తుల సౌకర్యార్థం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ రవి ఆధ్వర్యంలోఉచిత వైద్యం అందించి మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా స్వచ్ఛంధ సంస్థలు భక్తులకు అన్నదానం, తాగునీటిని పంపిణీ చేశారు. మూడురోజుల పాటు జరిగేఈజాతరకు పోలీస్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ జాతర ఏర్పాట్లను సీఐ ఎస్ రాజ్ కుమార్ గౌడ్ ఎస్సై బోలగాని సతీష్ గౌడ్‌తో కలిసి పరిశీలించారు.

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలీస్ బందోబస్తు

- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్

నవతెలంగాణ-మహబూబాబాద్

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని 150 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన 16 పోలింగ్ కేంద్రాలో 1663 మంది ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేల పోలింగ్ పక్రియ మొదలు నుండి పూర్తి అయ్యేవరకు పోలింగ్ కేంద్రాల వద్ద విధులలో ఉన్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలోని పోలీస్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా163 బీఎన్ఎస్ఎస్ ఆక్ట్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, 100 మీటర్ల, 200 మీటర్ల పరిధిలో ఆంక్షలు ఉంటాయని, ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉందన్నారు. ఐదుగురు కాని అంతకంటే ఎక్కువమంది కాని గుంపులు గుంపులుగా తిరగవద్దన్నారు. పార్టీ జెండాలు, పార్టీ గుర్తులు, ప్లే కార్డ్స్ ధరించవద్దు, ప్రదర్శించవద్దన్నారు. మైకులు, లౌడ్ స్పీకర్లు వాడరాదని, పాటలు ఉపన్యాసాలు ఇవ్వకూడదన్నారు. మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదన్నారు. ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, టపాకాయలు కాల్చడం లాంటివి నిర్వహించడం నేరంగా పరిగణించడంతో పాటు సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటు హక్కు కలిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయులు, పోలీసుల సలహాలు, సూచనలు పాటించి ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలని సూచించారు.

నేడు 144 సెక్షన్ అమలు

నవతెలంగాణ-గార్ల:

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా నేడు(గురువారం) స్దానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారని ఎన్నికల కోడ్‌లో భాగంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్సై ఎస్ కె.రియాజ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ పరిధిలో ప్రజలు గుంపులు గుంపులుగా తిరగ వద్దని, పోలింగ్ కేంద్రం నుండి 200 మీటర్ల దూరంలో ఉన్న షాపులు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మూసి వేయాలని ఆదేశించారు.నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నమోదు ప్రశాంతంగా జరిగేందుకు ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

నవతెలంగాణ-పెద్దవంగర:



వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. మండలం నుండి 34 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును బ్యాలెట్ ద్వారా వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 17 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. నేడు(గురువారం) ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, 4 గంటల సమయానికి ఓటు వేసేందుకు లైన్‌లో ఉన్నవారందరికీ ఓటు వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాగే ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపారు.

ఏఎంసీ డైరెక్టర్ మదన్మోహన్‌రెడ్డికి మాతృ వియోగం

నవతెలంగాణ-పెద్దవంగర:



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కొడకండ్ల ఏఎంసీ డైరెక్టర్ కుందూరి మదన్‌మోహన్‌రెడ్డి తల్లి నిర్మలమ్మ (85) వృద్ధాప్యంతో బుధవారం మృతి చెందారు. ఆమె పార్థివదేహానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల ఉపాధ్యక్షుడు రంగు మురళిగౌడ్, మార్కెట్ డైరెక్టర్ బానోతు గోపాల్‌నాయక్, మండల ప్రధాన కార్యదర్శి ఓరిగంటి సతీష్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు సీతారాంనాయక్, మండల యూత్ అధ్యక్షులు హరికృష్ణ గౌడ్, బానోతు వెంకన్న, గ్రామ పార్టీ అధ్యక్షులు రసాల కొమురయ్య, మాజీ ఎంపీటీసీ సోమన్ననాయక్, దేవా, సుధాకర్, రమేష్, సురేష్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కాళేశ్వరం ఎస్సై తామస్ రెడ్డి

నవతెలంగాణ-మహదేవపూర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన మహాదేవపూర్ మండలం అన్నారం గ్రామంలో బుధవారం జరిగింది. వివరాల్లోకెళ్తే... భూపాలపల్లి మండలం జంగేడు గ్రామంకు చెందిన శ్రీమర్తి సమ్మయ్య, అతని భార్య భాగ్య(50) కలిసి బైక్‌పై శివరాత్రి సందర్భంగా కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో మహాదేవపూర్ మండలం అన్నారం క్రాస్ రోడ్డు వద్దకు చేరుకోగానే వారి స్కూటీ అదుపుతప్పి కింద పడ్డారు. వెనకాల కూర్చున్న భాగ్య తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందింది. కాళేశ్వరం ఎస్సై తామస్ రెడ్డి వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

హత్య కేసులో నిందితులు అరెస్ట్

డీఎస్పీ సంపత్‌రావు

నవతెలంగాణ-చిట్యాల

మంత్రాలనెపంతో వృద్ధురాలిని హత్య చేసి బంగారు వెండి నగలు ఎత్తుకెళ్లిన నిందితులను బుధవారం అరెస్టు చేసినట్టు డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. బుధవారం చిట్యాల సర్కిల్ కార్యాలయంలో సీఐ మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం బోయినపల్లి గ్రామానికి చెందిన సొరపాక వీరమ్మ(70) 19.02.2025న ఆమె సేకరించిన చింతపండును తన పక్క గ్రామమైన గరిమెళ్ళపల్లికి అమ్ముకోవడానికి వెళ్లి అదృశ్యమైంది. ఈ ఆమె ఆచూకి కోసం కుటుంబీకులు వెతకగా లభించలేదు. 23.02.2025న బోయినపల్లి గరిమెళ్ళపల్లి మధ్యలో పసిక మనమ్మ చెందిన వ్యవసాయ బావిలో ఆమె మృతదేహంను ఓ బాటసారి గమనించి గ్రామస్తులకు తెలిపాడు. వారు వచ్చి శవాన్ని బయటకు తీసి వీరమ్మదిగా గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు చంపి గోనెసంచిలో కుక్కి బావిలో వేశారు. టేకుమట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. గరిమెళ్ళ పల్లెలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు, టెక్నికల్ సాక్షాలు ద్వారా కొంతమంది అనుమానితుల్ని విచారించి నిందితులను పట్టుకున్నారు. బోయిని మల్లయ్య ఎ 1, పుట్ట కొక్కుల శ్రీనివాస్ , మద్దెల సిద్ధూ,



లొంగిపోయారు. బోయిని మల్లయ్య చిన్న కూతురుకి అనారోగ్యం నయం కాకపోవడంతో వీరమ్మ మంత్రాలు చేస్తుందనే అనుమానంతో తన బంధువైన పుట్టకొక్కుల శ్రీనివాస్ అలియాస్ కిట్టు, కిట్టు స్నేహితుడైన మద్దెల సిద్దుల సహాయంతో 19.02.2025న గర్మెల్లపల్లి సెంటర్ వద్ద వీరమ్మను చెట్లపొదలు తీసుకెళ్లి గొంతు నుమిలి హతమార్చారు. ఆమె శరీరం పై ఉన్న సుమారు రెండు తులాల బంగారు గొలుసు, 30 తులాల వెండి కడాలు తీసుకున్నారు. సిద్దు ద్వారా గోనెసంచి తాడు తెప్పించుకొని వీరమ్మని గోనెసంచి కుక్కి సమీప బావిలో వేసి పరారయ్యారు. నిందితులు నేరం ఒప్పుకోవడంతో వారిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. కేసును త్వరితగతిన చేదించిన చిట్యాల సీఐ డి.మల్లేశ్, టేకుమట్ల ఎస్ఐ సుధాకర్, సిబ్బంది, ఏఎస్ఐ అమరేందర్ రెడ్డి, హెచ్‌సీ రమేష్, పీసీ మహేందర్ నాగరాజు,రంజిత్ సతీష్‌ను భూపాలపల్లి డిఎస్‌పి సంపత్‌రావు అభినందించారు.

మినరల్ వాటర్ పంపిణీ

నవతెలంగాణ- ములుగు



పది సంవత్సరాల నుండి మహాశివరాత్రి సందర్భంగా రామప్ప దేవాలయానికి వచ్చే వారికి గంగిశెట్టి శ్రీనివాస్ తల్లి సరస్వతి జ్ఞాపకార్థం గంగిశెట్టి సత్యనారాయణ ఐరన్ మర్చంట్ సహకారంతో ములుగు లయన్స్ క్లబ్ ఆఫ్ ములుగు ఆధ్వర్యంలో సేవలందిస్తున్నారు. బుధవారం ప్రపంచ ప్రఖ్యాతి చెందిన రామప్ప దేవాలయంలో మహాశివరాత్రి సంద ర్భంగా వచ్చే ప్రజలకు ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వెంకటాపురం ఎంపీడీవో మూడ్ రాజు, రామప్ప దేవాలయం ఈవో బిల్లా శ్రీనివాస్ ములుగు లయన్స్ క్లబ్ సభ్యులు ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ ములుగు సేవలను అభినందించారుములుగు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మెరుగు రమేష్ మాట్లాడుతూ ఇలాంటి సేవలు మరిన్ని చేపడతామన్నారు. కార్యక్రమంలో ములుగు లయన్స్ క్లబ్ సెక్రటరీ చుంచు రమేష్, కోశాధికారి సానికొమ్మ రవీందర్ రెడ్డి లయన్, కొండి సాంబశివ లయన్, ముక్కు సుబ్బారెడ్డి లయన్, ఆడెపు రాజు, రాజు యాదవ, ములుగు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సందర్శకులకు మంచినీటి సౌకర్యం

నవతెలంగాణ-మహదేవపూర్

మహాశివరాత్రి సందర్భంగా కాళేశ్వరం దేవస్థానంలో ప్రజలకు తాగునీరు పంపిణీ కార్యక్రమాన్ని మహాదేవపూర్ మండల పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కోట రాజబాపు కాళేశ్వరం దేవస్థానం మాజీ డైరెక్టర్ మెంగాని అశోక్ ఆధ్వర్యంలో బుధవారం తాగునీటి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు లేతకారి రాజబాపు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గందేసిరి మధుసూదన్, నాయకులు పాల్గొన్నారు.

జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

నవతెలంగాణ-మల్హర్‌రావు

మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని మండలంలోని నాచారం మల్లన్న గుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం శివపార్వతుల కల్యాణోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల సందర్శకులు తాగడానికి నీళ్ల లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి దప్పిక తీర్చారు. ఇందుకు సందర్శకులు,గ్రామస్తులు ఫౌండేషన్ చైర్మన్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ టీం సభ్యులు పాల్గొన్నారు.



కాళేశ్వరంలో గోదావరి హారతి

నవతెలంగాణ-కాళేశ్వరం

శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారి ఆలయం ఆధ్వర్యంలో ప్రత్యేక హారతి ఇచ్చారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు ముక్తేశ్వర సుభానంద కళ్యాణం అనంతరం ఆలయ అర్చకులు మంగళ వాయిద్యాలు నడుమ గోదావరికి వెళ్లి గోదావరి వద్ద గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. నక్షత్ర హారతి తదితర హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో మహేష్, తదితర అధికారులు ఉన్నారు.



పోగొట్టుకున్న బ్యాగులు బాధితులకు అందజేత : డిపో మేనేజర్

నవతెలంగాణ-కాళేశ్వరం

కాళేశ్వరం బస్టాండ్‌లో మహాశివరాత్రి సందర్భంగా వచ్చిన భక్తులు పోగొట్టుకున్న బ్యాగును బాధితులకు డిపో మేనేజర్ ఇందు అందజేశారు. బుధవారం బస్సు స్టేషన్ లో ఏర్పాటు చేసిన క్యాంపులో ఒక ప్రయాణికురాలు బ్యాగు,ట్యాబు (మొబైల్)భూపాలపల్లి డిపో బస్సు నంబర్ 0010 లో పోగొట్టుకున్నది. పోగొట్టుకున్న బ్యాగును కండక్టర్ సిహెచ్ బాలు సమక్షంలో అప్పగించారు. అనంతరం వారిని అభినందించారు.

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీని కేటాయించాలి : రాజమల్ల సుకుమార్

నవతెలంగాణ-మంగపేట

ములుగు నియోజకవర్గానికి ఎమ్మెల్యే కోటాలో ఒక ఎమ్మెల్సీని కేటాయించాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు రాజ మల్ల సుకుమార్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రస్తుత సభ్యుల సంఖ్య బలం ప్రకారం ఒక ఎమ్మెల్సీ వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ములుగు నియోజకవర్గానికి చెందిన నాయకులకు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ములుగు నియోజకవర్గం 1952లో ఏర్పడిన నాటి నుండి నేటి వరకు నియోజకవర్గానికి 73 సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు చరిత్రలో ములుగు నియోజకవర్గము నుండి ఎమ్మెల్సీగా అవకాశం లేదని ఏ రాజకీయ పార్టీ కూడా ములుగు నియోజకవర్గానికి చెందిన వ్యక్తులకు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించలేదని తెలిపాడు. విమానం కచ్చితంగా ఎమ్మెల్సీ అవకాశం ములుగు నియోజకవర్గానికి సంబంధించిన నేతలకు ఇస్తే అది బీఆర్ఎస్ పటిష్టతకు నిర్మాణానికి ఉపయోగపడుతుందని అన్నారు. పార్టీ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం కోసం ములుగు జిల్లాకు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని సుకుమార్ కోరాడు.

పాము కాటుతో చిన్నారి మృతి

నవతెలంగాణ-చిట్యాల

పాము కాటుతో ఓ చిన్నారి మృతిచెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గిద్దెముత్తారం గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కిన్నెర శిరీషరాజు దంపతులు కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు,కుమార్తె కిన్నెర కీర్తన(7) ఉన్నారు. కాగా, కుటుంబ సమేతంగా ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి నిద్రిస్తుండగా పాము కాటుకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు హుటా హుటిన అర్ధరాత్రి ఒంటి గంటకు చిట్యాల మండలకేంద్రంలోని ప్రభుత్వ దవఖానకు తీసుకువెళ్ళారు. వైద్యుల సూచనల మేరకు భూపాలపల్లి ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి వరంగల్ పట్టణంలోని ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న బిడ్డ కండ్లముందే కానరాని లోకానికి వెళ్లడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఘనంగా మహా శివరాత్రి వేడుకలు

కిక్కిరిసిన ఉమాచంద్రశేఖరస్వామి దేవస్థానం

నవతెలంగాణ-మంగపేట

మహాశివరాత్రి పర్వదిన వేడుకలను మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. వేకువ జామునే నిద్రలేచి సమీపంలోని గోదావరి నదిలో పుణ్య స్నానాలను ఆచరించారు. మండల కేంద్రంలోని శ్రీ ఉమా చంద్రశేఖర స్వామి దేవాలయంతో పాటు వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. ఉమా చంద్రశేఖర స్వామి దేవస్థానంలో ఆలయ అర్చకుడు నరేష్ శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున నాలుగు గంటల నుండి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు ప్రారంభించి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగించారు. ఈ పూజ కార్యక్రమాలను తిలకించేందుకు మండలంలోని కమలాపురం కోమటిపల్లి బోర నరసాపురం తిమ్మంపేట గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనంతో కిక్కిరిసి పోయాయి. ఉమా చంద్రశేఖర స్వామి ఆలయ చైర్మన్ కోలగట్ల నరేష్ రెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సాయంత్రం 7గంటల నుండి ఆలయ పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు శివపార్వతుల కళ్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం రాత్రి 11గంటల సమయంలో శ్రీ ఉమా చంద్రశేఖరస్వామి దివ్య కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాలకమండలి చేసిన ఏర్పాట్లపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కిక్కిరిసిన మల్లన్నగుట్ట, నైనగుళ్ళు

మల్హర్‌రావు :

మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని మండలంలోని నాచారం గ్రామపరిధిలో ఆటవిలోగల గుట్టల్లో వెలసిన శ్రీమల్లిఖార్జున స్వామి ఆలయంలో, కొయ్యుర్ గ్రామపరిధి పివినగర్ అడవుల్లో పురాతన మహాలింగేశ్వర స్వామి ఆలయంలో, పెద్దతూండ్ల గ్రామంలోని శ్రీహనుమాత్ సహిత శ్రీమద్రాజేశ్వరి పంచాయతన ఆలయంలో, భూపాలపల్లి, పెద్దపల్లి రెండు జిల్లాల సరిహద్దుల్లో ఉన్న సందరెల్లి ఆలయంలో బుధవారం శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవం తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో సందర్శకులు పోటెత్తారు. సందర్శకులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొయ్యుర్ పోలీసులు,ఆలయాల కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టారు.











మల్లన్నగుట్టలో శ్రీమల్లిఖార్జున స్వామి పెద్దపట్నం, నైవేద్యం, హారతి తదితర పూజా కార్యక్రమాలు నేడు జరుగుతాయని నిర్వాహకులు చేపూరి రాజేందర్ తెలిపారు. శ్రీహనుమాత్ సహిత శ్రీమద్రాజరాజేశ్వరి పంచాయాతన మందిరంలలో ప్రత్యేక పూజలుంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు సోదరుడు,శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు, తాడిచెర్ల పిఏసిఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, ఆలయాల కమిటీ సభ్యులు,అత్యధిక సంఖ్యలో సందర్శకులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం

ఏటూరునాగారం ఐటిడిఏ

మండల కేంద్రంలోని శ్రీఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ ఉమా రామలింగేశ్వర ఆలయంలో బుధవారం రాత్రి 11.10 నిమిషాలకు శివపార్వతుల కళ్యాణాన్ని వేద పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండే సహస్ర ఘటాభిషేకం కార్యక్రమాన్ని అర్చకులు రాజ్‌కుమార్ నిర్వహించారు. సమీపంలోని జంపన్న వాగు నుంచి జలాన్ని తీసుకువచ్చి శివలింగానికి అభిషేకం చేశారు.అనంతరం స్థానిక సీఐ అనుముల శ్రీనివాస్ దంపతులతో వచ్చి అభిషేకం చేశారు. అనంతరం కల్యాణ మహెూత్సవాన్ని అర్చకులు సిద్ధాంతిశర్మ, రాజ్‌కుమార్‌లు నిర్వహించారు. మండలంలోని రామన్నగూడెం, షాపెల్లిలోని రాజన్నగుట్ట వద్ద శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు.

కిటకిటలాడిన దేవాలయాలు

గణపురం :

గణపురం మండలం లక్ష్మారెడ్డి పల్లి లోని శ్రీ రామలింగేశ్వర సహిత అభయాంజనేయ స్వామి దేవాలయం మండల కేంద్రంలోని రెడ్డి గుడి. చేల్పూర్ లోని శ్రీ సాంబమూర్తి దేవాలయం, ధర్మ రావు పేట లోని దేవాలయాల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం సందర్శకులతో కిక్కిరిసిపోయింది. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఐ రేఖ అశోక ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

శివకేశవ ఆలయంకు సందర్శకుల తాకిడి

టేకుమట్ల :

టేకుమట్ల మండలం వెలిశాల గ్రామంలోని శ్రీ శివకేశవ స్వామి ఆలయం మహాశివరాత్రి వేడుకల సందర్భంగా సందర్శకుల తాకిడి పెరిగింది. భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ ఎమ్మెల్యే దంపతులిద్దరిని సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో స్కూల్ పిల్లల డ్యాన్స్ ప్రదర్శనలు, మహిళల కోలాటాలు, భజన మండళ్ల స్వరార్చన ఆకట్టుకున్నాయి. వేడుకలు ప్రశాంతంగా సాగేందుకు ఆలయ కమిటీ విశేష కృషి చేస్తోంది. ఎమ్మెల్యే వెంట మండల, జిల్లా నాయకులు ఆలయ చైర్మన్ తదితరులు ఉన్నారు.

అంగరంగ వైభవంగా అమరేశ్వరుని కళ్యాణం

మహాదేవపూర్:

మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలోని అతి ప్రాచీనమైన పురాతనమైన ప్రసిద్ధిగాంచిన శ్రీ అమరేశ్వర ఆలయంలో బుధవారం మహా శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గొడవర్తి నాగేశ్వర శర్మ మహా రుద్రాభిషేక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను గోదావరి నదిలో అభిషేకం చేసి కన్నుల పండుగగా శివ పార్వతుల కళ్యాణం నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన అన్న ప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆర్కెస్ట్రా భజన బృందం చే జాగరణ చేసే వారికి భజన కార్యక్రమం నిర్వహించారు. అమరేశ్వర ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. బెగుళూరు గ్రామంలో గోదావరి సమీపంలో ఆంజనేయస్వామి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా కళ్యాణ వేడుకలు నిర్వహించారు ఆలయ నిర్వాహకులు, పూర్వ ప్రముఖులు పాల్గొన్నారు.

పంబాపూర్‌లో ఘనంగా శివపార్వతుల కళ్యాణం

నవతెలంగాణ-తాడ్వాయి

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని పంబాపూర్ గ్రామంలో లో శివరాత్రి సందర్భంగా శివాలయం ముస్తాబైంది. గురువారం మహాశివ రాత్రికి శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయంతో పాటు, మిగతా అక్కడ ఉన్న వివిధ ఆలయాలు సందర్శకులతో కిక్కిరిసాయి. గ్రామస్తులు ఘనంగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు గుట్ట దేవరను భజన కీర్తనలతో, ప్రత్యేక పూజలతో తీసుకువచ్చారు. రాత్రి ఎనిమిది గంటలకు గంగా స్థానాలు ఆచరించి, రాత్రి 12 గంటలకు రుద్రాభిషేకం, ఒంటి గంట కు శివపార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. గుడి నిర్వాహకురాలు ప్రధాన పూజారి నాలి పుల్లక్క, పంభాపూర్ శివ భక్తుల సంఘం అధ్యక్షులు నాలి రవి ఆధ్వర్యంలో శివ పార్వతుల కళ్యాణం జరిపించారు. స్థానిక మాజీ సర్పంచ్‌లు ఎల్లబోయిన జానకిరాం బాబు, పోలెబోయిన కృష్ణ, మేడారం ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ నాలి కన్నయ్య, మాజీ జెడ్పిటిసి రామ సహాయం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ యూత్ నాయకులు ముక్తి రామస్వామి, పోలెబోయిన కుమార్, అర్రెం కృష్ణ, కల్తి నారాయణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు. సరిహద్దు జిల్లాలైన భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలొచ్చారు. గ్రామ పెద్దలు, గామ ప్రముఖులు, వివిధ యూత్ సంఘాల నాయకులు, గ్రామస్తులు మహాశివరాత్రి కార్యక్రమాలను నిర్వర్తిస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు మౌలిక సదుపాయాలను కల్పించారు. పంబాపూర్ గ్రామ పంచాయతీ సిబ్బంది ముమ్మరంగా శానిటేషన్ పనులు నిర్వహించారు.





ప్రభుత్వ సహాయం అందించాలి : ఆలయ నిర్వాహకురాలు నాలి పుల్లక్క:

సుమారు పదేళ్లగా మహా శివరాత్రి మహెూత్సవాలు ఘనంగా సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వాహకులు ప్రధాన పూజారి నాలి పులక్క, నాలి రవి అన్నారు. ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందించాలని వారు కోరారు. మహా శివరాత్రి కార్యక్రమాలు ఇంకా ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. అధికారులు స్పందించి పంబాపూర్ శివాలయానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

బహుమతులు ప్రదానం

మహాశివరాత్రి సందర్భంగా పంభాపూర్ గ్రామంలో యువకులకు విద్యార్థులకు గత మూడు రోజుల నుండి క్రీడలను నిర్వహిస్తున్నారు. బుధవారం పంబాపురం లోని శివాలయం ఆవరణలో విజేతలకు మంత్రి డాక్టర్ సీతక్క కుమారుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు, మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్చార్జి ధనసరి సూర్య బహుమతులు అందజే శారు. యూత్ నాయకులు పోలేబోయిన కుమార్, యూత్ నాయకులు గ్రామ ప్రముఖులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఏఎమ్మార్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండలంలోని కొయ్యుర్ గ్రామపంచాయతీ పరిధిలోని పివినగర్ అటవీప్రాంతంలో ఉన్న నైనగుహల్లో మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరిం చుకుని శివపార్వతుల కల్యాణం అంగరంగవైభవంగా ఆలయ కమిటీ ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించడానికి వచ్చిన సందర్శకు లకు తాడిచెర్లలో బొగ్గు తవ్వకాలు చేపట్టిన ఏఎమ్మార్ కంపెనీ సిఎండి మహేశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు 50 కిలోల అల్పాహారం పంపిణీ చేశారు. ఏఎమ్మార్ సిబ్బంది పాల్గొన్నారు.

108 అంబులెన్స్ సేవలు

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో మహాశివరాత్రి పురస్కరిం చుకొని 108 అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉన్నాయని జిల్లా మేనేజర్ మెరుగు నరేష్ బుధవారం తెలిపారు. మూడు రోజుల వరకు అత్యవసర సేవల కొరకు ప్రజలకు అందుబాటులో రెండు 108 అంబులెన్స్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒకటి టెంపుల్ దగ్గర మరొకటి పీహెచ్‌సీ ఆసుపత్రిలో ఉందన్నారు. మహాదేవపూర్ సిఎస్సి హాస్పిటల్ లో కూడా అందుబాటులో 108 అంబులెన్స్ ఉంటుందన్నారు. అత్యవసర సేవలను కాళేశ్వరం పరిసర ప్రజలందరూ వినియోగిం చుకోవాలని అన్నారు. ఆయనవెంట 108 స్టాఫ్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషి యన్ మహేష్, దేవేందర్ పైలెట్ సంపత్, స్వామి రియాజ్ ఉన్నారు.

మహాశివరాత్రి శుభాకాంక్షలు

మంత్రి శ్రీధర్ బాబు

నవతెలంగాణ-మల్హర్‌రావు

మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని బుధవారం తెలంగాణ రాష్ట్ర ఐటి,పరిశ్రమల,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు మంథని, భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాలతోపాటు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు ఎల్లప్పుడు సుఖ సంతోషాలతో ఉండాలని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

వరంగల్
గురువారం ఫిబ్రవరి 27, 2025

కాళేశ్వరంలో మహా శివరాత్రి ఉత్సవాల


దృశ్యమాలిక
















శ్రీదూడల మల్లికార్జున స్వామి ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు

నవతెలంగాణ-పర్వతగిరి



మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీ దూడల మల్లిఖార్జున స్వామి దేవాలయం అభివృద్ధి పునర్నిర్మాణంలో భాగంగా బుధవారం శ్రీ దూడల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి కమిటీకి మండలం లోని అనంతారం గ్రామానికి చెందిన క్రీ.శే. గొర్రె కొమురయ్య -కట్టమ్మ జ్ఞాపకార్థం వారి కొడుకు, కోడలు దేవేందర్-లక్ష్మీలు ప్రస్తుత చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్ గొర్రె దేవేందర్ మనుమండ్లు, మనుమరాలు విజయ్-వనమాల, అనిల్-సుకన్యలు ఆలయ పునర్నిర్మాణానికి మల్లన్న, కేతమ్మ, మేడలమ్మ విగ్రహాలను అందించారు. అలాగే మకరతోరణంతో పాటు రూ.లక్ష ముప్పై వేలను విరాళంగా అందజేశారు. నర్సంపేట మండలం ద్వారకాపేట గ్రామానికి చెందిన దొంగల మల్లయ్య- మల్లికాంబ వారి కొడుకులు, కోడళ్లు తిరుపతి - భార్గవి, స్వామి - రమ దంపతులు ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు రూ.20,332లు అందజేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బెల్లం రాధిక రాజు తెలిపారు.



శివాలయాలో భక్తుల ప్రత్యేక పూజలు

ఘనంగా.. మహాశివరాత్రి వేడుకలు

నవతెలంగాణ-వర్ధన్నపేట

మహాశివరాత్రి సందర్భంగా పలు ఆలయాలలో భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఆలయాలతో పాటు ఇల్లంద, ఆకేరు ఒడ్డున ఉన్న రాజరాజేశ్వర స్వామి ఆలయం గ్రామంలో ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయాలలో మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు ప్రత్యేకంగా జాగరణ ఉన్న భక్తులు శివనామ స్మరణతో భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్ష చేపట్టారు.మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలను ప్రత్యేకత అలంకరించారు.

భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి మహోత్సవం



నవతెలంగాణ-నల్లబెల్లి

మండలంలోని గుండ్లపహాడ్ గ్రామంలో శ్రీరాజరాజేశ్వర దేవాలయంలో, మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర దేవాలయంలో బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పురోహితులు బెలిగిని రాజకోటయ్య, మొగిలి భక్తులకు తెల్లవారుజాము నుండి గణపతి పూజ, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. . శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వచ్చిన భక్తులకు కమిటీ ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందించి ఎంతో వైభవంగా శివరాత్రి వేడుకలను నిర్వహిస్తున్నారు.

28న టీఏఎస్ మండల స్థాయి సమావేశం

నవతెలంగాణ-పర్వతగిరి

ఈనెల 28వ తేదీన పర్వతగిరి మండల కేంద్రంలో జరుగు తెలంగాణ అంబేద్కర్ సంఘం మండల స్థాయి సమావేశం జయప్రదం చేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నరసయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు బుధవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 28న జరుగు మండల స్థాయి సమావేశం అనంతరం తెలంగాణ అంబేద్కర్ సంఘం పర్వతగిరి మండల కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు కంజర్ల మహేష్, జిల్లా కన్వీనర్ తాటికాయల వివేకానంద, కో-కన్వీనర్ జంగిలి భాస్కర్, నాయకులు జిల్లా రవి, కాసర్ల రాములు, అర్షం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివ నామస్మరణతో.. మారుమోగిన ఆలయాలు

- కనుల విందుగా శివపార్వతుల కల్యాణం
- కొత్త రాయపర్తి శివాలయంలో.. మిన్నంటిన వేడుకలు

నవతెలంగాణ-రాయపర్తి



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం మండలంలో శివాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. కోరిన కోర్కెలు తీర్చుతూ.. భక్తులకు కొంగుబంగారాన్ని అందిస్తున్న మహ శివుడిని హర హర మహాదేవ.. ఓం నమశివయా, హరోంహర, శంభోశంకర నామస్మ రణలతో ఆలయాలు మారు మోగాయి. నీలకంఠ స్వామిని భక్తిప్రపత్తులతో కొలిచేందుకు చిన్నా, పెద్ద అందరూ తెల్లవారుజామున పుణ్య స్నానాలు చేసి ఆది దంపతులను దర్శించుకునేందుకు శివాల యాలకు క్యూ కట్టారు. ఆలయాలను పువ్వులతో, విద్యుద్దీపాల అలంకరణలతో అందంగా ముస్తాబు చేశారు. జాగరణ ఉండే భక్తుల కోసం పలు ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, సంకీర్తలను నిర్వహిస్తున్నారు. కొత్త రాయపర్తిలో కాకతీయుల కాలంలో నిర్మించిన శివాలయానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. శివాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణం కన్నుల విందుగా నిర్వహించారు. టీపీసీసీ మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో అర్చకులు రామకృష్ణ చార్యులు, విజయ్‌కుమార్ శర్మ, ఆకారపు వినయ్ శాస్త్రి, ఆలయ చైర్మన్ బందెల బాలరాజు, వైస్ చైర్మన్ మాచర్ల ప్రభాకర్, తాజా మాజీ సర్పంచ్ గారె నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



క్రీడలు శరీర ధారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

- పీఏసీఎస్ చైర్మన్ రాజేష్ ఖన్నా

నవతెలంగాణ-వర్ధన్నపేట

క్రీడలు శరీర దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని వర్ధన్నపేట పీఏసీఎస్ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా అన్నారు. రాయపర్తి మండలం గన్నారం గ్రామంలో జన్నపురెడ్డి శ్రీరామ్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు.ఫైనల్స్‌లో వర్ధన్నపేట మండలం కొత్తపల్లి టీమ్ ప్రథమ స్థానం కైవసం చేసుకోగా రెండవ స్థానం గన్నారం గ్రామం కైవసం చేసుకుంది. గెలుపొందిన క్రీడాకారులకు బుధవారం వర్ధన్నపేట పీఏసీఎస్ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా ముఖ్యఅతిథిగా హాజరై జన్నపురెడ్డి శ్రీరామ్‌రెడ్డితో కలిసి బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా రాజేష్ ఖన్నా మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. ఇటువంటి క్రీడలు ఎల్లప్పుడూ నిర్వహించిన తాను ప్రోత్సహిస్తానని తెలియజేశారు. మొదటి బహుమతి కైవసం చేసుకున్న కొత్తపల్లి టీమ్ కెప్టెన్ చింతల నాగరాజుతో పాటు టీంసభ్యులను అభినందించారు.

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

నవతెలంగాణ- నెక్కొండ

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆలయాలు శోభను సంతరించుకున్నాయి ఉదయం నుండే భక్తులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో ఆలయ అర్చకులు బీవీఎస్ శాస్త్రి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో చైర్మన్ బెజ్జంకి వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు చేశారు. . రాత్రివేళ శివ కళ్యాణం ఆయా ఆలయాల్లో ఘనంగా చేపట్టారు.

ఢిల్లీ సీఎం రేఖాగుప్తాను పదవీ నుండి తొలగించాలి

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రామ్మూర్తి

నవతెలంగాణ-కాశిబుగ్గ



తన క్యాంపు కార్యాలయంలో అంబేద్కర్ ఫోటో తొలగించి మనవాదుల ఫోటో పెట్టిన ఢిల్లీ సీఎం రేఖ గుప్తాను పదవీ నుండి తొలగించాలని మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పసుల రామ్మూర్తి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని శంభునిపేటలో జరిగిన మాల మహానాడు ఆఫ్ ఇండియా ముఖ్య కార్యకర్తల సమావేశానికి రామ్మూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉన్న అంబేద్కర్, భగత్‌సింగ్ ఫోటోలను ముఖ్యమంత్రి రేఖా గుప్తా తీసి వేయించి ఆస్థానంలో బిజెపి మనువాదుల ఫోటోలు పెట్టడం సిగ్గుచేటన్నారు. అంబేద్కర్‌ను అవమానించిన బిజెపికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. మాల మహానాడు ఆఫ్ ఇండియా జిల్లా ఉపాధ్యక్షుడు మన్నె కరుణాకర్ అధ్యక్షతన ఈ సమావేశంలో నాయకులు ఉసిల్ల మల్లయ్య, కారు శ్రీపాల్, మగ్గిడి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

14న కంఠ మహేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని వడ్లకొండలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ కంఠ మహేశ్వర స్వామి దేవాలయం వేడుకలు మార్చి (వచ్చే నెల) 14 నుండి 18 వరకు కళ్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి ఏరుకొండ శ్రీనివాస్ తెలిపారు.14న మాలధారణ, గౌడ పురాణం,15న విగ్రహాల ఊరేగింపు, గౌడ పురాణం రెండవ భాగం,16న గణపతి హోమం, నవ గ్రహ హోమం, రుద్రహోమం, 17న విగ్రహ ప్రతిష్టాపన, 18న వనదేవతల పూజలు, బలి ప్రధానం జరుగునట్లు ఈకార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గౌడ సంఘం వడ్లకొండ వారు బుధవారం తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

నవతెలంగాణ-నల్లబెల్లి



మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించే వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైనట్లు బూత్ అధికారి (పీవో) డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్ అన్నారు. నల్లబెల్లి పోలింగ్ స్టేషన్ 40లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లు 64 ఉన్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలను సీసీ కెమెరాల నిఘాలలో పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

సాయిబాబా ఆలయంలో ..మహాఅన్నదానం..

నవతెలంగాణ-బయ్యారం:



మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో శివ రాత్రి సందర్భంగా మహా అన్న దాన కార్యక్రమాన్ని బుధ వారం నిర్వహించారు. ఈఅన్నదాన కార్యక్రమంలో మం డల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజలకు ఎటు వంటి అసౌకర్యం కలగ కుండా రమణమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



గంగమ్మ దేవాలయంలో.. మహాశివరాత్రి మహోత్సవం

నవతెలంగాణ-కొత్తగూడ

గంగారం గ్రామంలో గంగమ్మ దేవాలయంలో ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినాన మహాశివరాత్రి మహోత్సవం పూజారులు, శివసత్తులు గత 30 సంవత్సరాలుగా ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంటారు. ఈజాతరకు వివిధ మండలాలు, గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివ అనుగ్రహం పొంది పరవశించి పోతుంటారు. ఇక్కడికి వచ్చిన భక్తులకు కోరిన కోరికలు, సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాతర కమిటీ నిర్వహిస్తుంది.

వైభవంగా.. శివపార్వతుల కళ్యాణ మహోత్సవం..

నవతెలంగాణ-గూడూరు

మండలంలోని మట్టేవాడ ఏజెన్సీ గ్రామం పరిధిలోని నేలవంచ అటవీ ప్రాంతంలో అక్కడి గిరిజనులు ప్రతి ఏడాది శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాల మధ్య ఘనంగా శివపార్వతులకు కళ్యాణ హోత్సవం నిర్వహిస్తారు. శివరాత్రి పురస్కరించుకొని నేలవంచ గిరిజనులు తమ ఆదివాసి సాంప్రదాయాలతో ఘనంగా శివుడికి పూజలు, జాతర నిర్వహించి కళ్యాణ మహోత్సవ వేడుకలను కొనసాగించారు. ఈకార్యక్రమంలో పూజారులు బీజ్జా బుచ్చమ్మ ఉకే సమ్మక్క, పూనెం పార్వతి, ఏలుగొండ సుజాత, వాసం అనసూర్య, మూతి రామక్క, గ్రామ పెద్దలు మూతి బుచ్చి రాములు, దొర, పూనెం సూరయ్య, ఇరుప సురేష్ పటేల్, ఏలుగొండ సుధాకర్, కల్తి భిక్షం, బిజ్జా మహేందర్, ఉకే స్వామిలు పాల్గొన్నారు.

శివ నామంతో మారుమోగిన శివాలయం..

భారీ సంఖ్యలో భక్తుల పూజలు



నవతెలంగాణ-గూడూరు

మండల కేంద్రంలోని సనాతన శివాలయంలో శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని భక్తుల శివ నామంతో శివాలయం మారుమోగింది శివరాత్రి పురస్కరించుకొని శివాలయ ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ ఏపూరి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు భారీ సంఖ్యలో చేరుకొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఉదయం 4 గంటల నుండే నుండి పలు కార్యక్రమాలను వేదమంత్రాల మధ్య నిర్వహించారు. శివ దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. శివాలయ ప్రాంగణంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గూడూరు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బ్రహ్మ లింగేశ్వర బేకరీలో కల్తీ గుడ్డు వంటకాలు

- ప్లాస్టిక్ గుడ్లతో తయారీ కలకలం
- అధికారులు చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-బయ్యారం:



మండల కేంద్రంలోని ప్రముఖ బ్రహ్మ లింగేశ్వర బేకరీలో ప్లాస్టిక్ గుడ్లను ఉపయోగించి ఎగ్ పప్ తయారు చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. బంచరాయి తండాకు చెందిన జరుపుల సునీల్ అనే యువకుడు బేకరీలో ఎగ్ పప్ ఆర్డర్ చేయగా, అందులో ప్లాస్టిక్ గుడ్లను ఉపయోగిస్తున్నట్లు గుర్తించి ఈవిషయాన్ని బయటపెట్టారు. సునీల్ ఆరోపణలతో బయ్యారం పట్టణంలో కలకలం రేగింది. ప్రతి రోజు ఎందరో యువత, విద్యార్థులు, కుటుంబ సభ్యులు ఇక్కడ బేకరీ వంటకాలను ఆస్వాదిస్తున్నారు. కాని ప్లాస్టిక్ గుడ్లను ఉపయోగించడం వల్ల ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు ఏర్పడుతున్నదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈఆరోపణల పై బేకరీ నిర్వాహకులు నిర్లక్ష్యంగా స్పందించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏమైనా చేయగలరా? అధికారులంతా మా వెంటే ఉన్నారు అంటూ నిర్వాహకులు రెచ్చగొట్టేలా మాట్లాడారని, తమను భయపెట్టేందుకు ప్రయత్నించారని సునీల్‌నాయక్ తెలిపారు. ఈఘటనపై ఫుడ్ ఇన్స్‌పెక్టర్ వెంటనే విచారణ జరిపి బ్రహ్మలింగేశ్వర బేకరీపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే ఇటువంటి కల్తీ వ్యాపారాలను మూసివేయాలని, బేకరీని సీజ్ చేయాలని, లేకపోతే ఫుడ్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. మండల ప్రజలు, యువత ఈఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు బేకరీలో నాణ్యతాపరమైన లోపాలు ఉన్నాయని ఫిర్యాదులు వచ్చినా, సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బర్డ్ ఫ్లూ భయంతోనే చాలా మంది కోడి గుడ్లను దూరంగా పెడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ప్లాస్టిక్ గుడ్లు పెట్టి ప్రజలను మోసం చేయడం అతి దారుణమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సమస్యను ఉపేక్షిస్తే, ఇలాంటి కల్తీ ఆహారం మరింత వ్యాపించి ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం కలిగించే అవకాశం ఉందని, స్థానికులు, బాధితులు, యువత కలిసి మండలంలో ఫుడ్ సేఫ్టీ కోసం ఉద్యమించాలని, కల్తీ వ్యాపారాన్ని అంతమొందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.



నేటి యువత సెల్‌ఫోన్‌లకు బానిసలు కావద్దు

- ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్ కుమార్

నవతెలంగాణ-తొర్రూర్

నేటి యువత సెల్‌ఫోన్లకు బానిస కావద్దని ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక బర్డ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సిస్టర్ జెన్నీఫర్ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్ కుమార్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు, నేటి యువత సెల్‌ఫోన్‌ను అవసరం మేరకు వినియోగించాలని, అతిగా వినియోగిస్తే తీవ్ర ఆరోగ్య సమస్యలకు గురవుతారని విద్యార్థులకు సూచించారు. సెల్‌ఫోన్ వినియోగం వల్ల కలిగే ఉపయోగాలకంటే అధిక మొత్తంలో నష్టాలు సంభవిస్తాయన్నారు. అధికంగా మొబైల్ ఫోన్‌ను వాడడం వల్ల బ్రెయిన్ ట్యూమర్, క్యాన్సర్, స్కిన్ ఎలర్జీ, మెడ నొప్పి సమస్యలు, వినికిడి సమస్యలు, కంటిచూపు మందగిస్తుందన్నారు. ట్విట్టర్, ఫేస్ బుక్, ఇంస్టాగ్రామ్, వాట్సాప్ వంటి యాప్‌లలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవడం వల్ల లేనిపోని సమస్యలకు దగ్గర అవుతారని, అలాగే ఆన్‌లైన్ గేమ్స్ ఆడడం, ప్రమాదకర ప్రదేశాలలో రీల్స్ చేయడంవల్ల కొన్నిసార్లు ప్రాణాలను కోల్పోయి తల్లిదండ్రులకు తీరని నష్టాన్ని తెచ్చిపెడుతున్నారన్నారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశంలో యువత 65శాతం ఉన్నదని కావున నేటి యువత సెల్ ఫోన్‌లకు బానిసలు కాకుండా, చదువుల్లో రాణించి దేశ పునర్నిర్మాణంలో పాల్గొనాలని కోరారు. ఈకార్యక్రమంలో సిస్టర్ సంజిత, సంస్థ ప్రతినిధులు పద్మావతి, భాగ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని పెంచుతున్న మోడీ ప్రభుత్వ విధానాలు

- సీపీఐఎంఎల్ మాస్ లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి

నవతెలంగాణ-తొర్రూర్

గత 11 సంవత్సరాలుగా దేశంలో పరిపాలన సాగిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ పరిపాలన మతోన్మాద విధానాలు పెరగడానికి ఊతమిస్తుందని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 28న న్యూఢిల్లీలో జరుగు అఖిల భారత సదస్సును జయప్రదం చేయాలని బుధవారం తొర్రూర్‌లో ప్రచారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని స్వయం ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థలను ఒక పథకం ప్రకారం నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఆకాశాన్నంటుతున్న ధరలు, అంతులేని నిరుద్యోగం, పేదరికం, ఆకలి చావులు, మౌళిక సమస్యలను ఆలోచించకుండా మతం మత్తులో ప్రజలను ముంచుతున్నారన్నారు. మరోవైపు దేశ సహజ, సర్వసంపదను అంబాని, ఆదాని లాంటి కార్పొరేట్ సంస్థల దోపిడీకి గేట్లు తెరిచారని విమర్శించారు. ప్రజల సాంప్రదాయ పండుగలని ఆచారాలను కూడా హిందుత్వ రంగు పులిమి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వీటిపై విశాల ఐక్య ఉద్యమాలను తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. కేంద్రంలోని బిజెపి విధానాలపై సూత్ర బద్ధ పోరాటం చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈకార్యక్రమంలో నాయకులు అర్వపల్లి వెంకన్న, మాచర్ల మురళి, బానోతు నందీశ్వర్, బానోతు రవీందర్, రాములు, సుగుణమ్మ అనిత, రాములమ్మ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.



బిజినెస్

బంగారానికి అధిక ధరల దెబ్బ

- సగానికి తగ్గిన దిగుమతులు..!
- బలహీన డిమాండ్ ప్రభావం



న్యూఢిల్లీ : పేద, సామాన్యులకు బంగారం ధరలు అందుబాటులో లేకుండా పోవడంతో పసిడికి డిమాండ్ పడిపోతోంది. దీంతో దిగుమతులు సగానికి తగ్గనున్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో బంగారం దిగుమతులు 15 టన్నులకు పరిమితం కానుందని రాయిటర్స్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఏడాది క్రితం నాటి దిగుమతులతో పోల్చితే 85 శాతం క్షీణించి.. 20 ఏండ్ల నాటి కనిష్ట స్థాయికి పడిపోవచ్చని అంచనా వేసింది. ఈ ఏడాది జనవరిలోని 30-35 టన్నుల దిగుమతులతో పోల్చితే దాదాపుగా సగానికి క్షీణించొచ్చని విశ్లేషించింది. అంతర్జాతీయ బులియన్ మార్కెట్‌లో సోమవారం ఔన్స్ ధర రికార్డ్ స్థాయిలో 2,956 డాలర్లకు ఎగిసింది. అధిక ధరల కారణంగా డిమాండ్ భారీగా తగ్గింది. అమెరికా వాణిజ్య సుంకాల దాడికి తోడు ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, భౌగోళిక ఆందోళనలు బంగారం ధరలకు ఆజ్యం పోస్తున్నాయి. వీటికి తోడు డాలర్‌తో రూపాయి మారకం విలువ భారీగా క్షీణించి పసిడి ధరలను ఎగిసిపడేలా చేస్తోన్నాయి. 2025 జనవరిలో బంగారం దిగుమతులు 30-35 టన్నులకు పడిపోయి.. ఆరు నెలల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత నెలలో డిమాండ్ మరింత సన్నగిల్లిందని రిద్దిసిద్ధి బులియన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీరాజ్ కొఠారి పేర్కొన్నారు. దేశీయంగా డిమాండ్ తక్కువగా ఉండటం, రికార్డు స్థాయిలో పెరిగిన ధరల కారణంగా ఈ నెలలో బంగారం దిగుమతు లు 50 శాతం తగ్గొచ్చన్నారు. దేశంలో వివాహాల సీజన్ కొనసాగుతున్నప్పటికీ డిమాండ్ తక్కువగానే ఉందన్నారు. ధరలు పెరగక ముందు కొన్ని బ్యాంక్‌లు దిగుమతి చేసుకున్న బంగారాన్ని తిరిగి అమెరికాకు పంపిస్తున్నాయన్నారు. దీంతో అధిక రాబడులను పొందుతున్నాయన్నారు. భారత్‌లోని ఆభరణాల తయారీదారుల కోసం టోకుగా ఒక్క ఔన్స్‌పై 23 డాలర్ల తగ్గింపును అందిస్తో న్నాయన్నారు.గతేడాది దీర్ఘకాలంగా అస్థిరంగా ఉన్న ధరలు.. నవంబర్‌లో అకస్మాత్తుగా తగ్గినప్పటికీ.. తిరిగి ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత బంగారం ధరలకు రెక్కలు వచ్చాయి. ట్రంప్‌తో ప్రపంచ దేశాల్లో అనిశ్చితి నెలకొనడంతో సురక్షిత పెట్టుబడి కోసం బంగారంపై సెంట్రల్ బ్యాంక్‌లు, బులియన్ వర్తకులు పెట్టుబడులు పెంచా రు. దీంతో రెండు, మూడు నెలల్లోనే బంగారం ధరలు 14 శాతం మేర పెరిగా యి. దేశీయంగా బుధవారం 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.270 తగ్గి రూ.87,970 వద్ద నమోదయ్యింది. 22 క్యారెట్ల ధర రూ.250 తగ్గి రూ.80,650 వద్ద ముగిసింది. వచ్చే నెలలో 10 గ్రాముల ధర రూ.87,300 నుంచి 89,000 వరకు చేరొచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీనియర్ అనలిస్ట్-కమోడిటీ రీసెర్చ్ మానవ్ మోడీ తెలిపారు.

మహా కుంభ్‌ను పర్యావరణ కోసం కోకా-కోలా ఇండియా విప్లవాత్మక సస్టైనబిలిటీ

నవతెలంగాణ : భారతదేశంలోని అతిపెద్ద ఆధ్యాత్మిక సమావేశాలలో ఒకటి మహా కుంభ్ 2025లో ప్రారంభమైనందున, కోకా-కోలా ఇండియా తమ 'మైదాన్ సాఫ్' ప్రచారంతో ప్రవర్తనా పూర్వక మార్పును నడిపించడంలో మరియు శాశ్వత విలువను సృష్టించడంలో ముందుంది. ఈ సంవత్సరం, బ్రాండ్ పర్యావరణ సవాళ్లను మాత్రమే ఎదుర్కోవడం లేదు బీ వ్యర్థాలను విలువగా మార్చే ఆలోచనాత్మక, కమ్యూనిటీ-ఆధారిత కార్యక్రమాలతో ఇది నిజమైన మార్పును ప్రేరేపిస్తుంది. రీసైకిల్ చేయబడిన PET జాకెట్ల నుండి బాధ్యతాయుతంగా వ్యర్థాలను పారవేయడాన్ని ప్రోత్సహించే హైడ్రేషన్ కార్ట్‌ల వరకు, ఈ పర్యావరణ అనుకూల ఆవిష్కరణలు స్థానిక కమ్యూనిటీలకు సాధికారత ఇస్తూనే పర్యావరణాన్ని గౌరవించడం అంటే ఏమిటో పునర్నిర్వచించాయి.

మృదువైన మరియు పోషకమైన జుట్టు కోసం హెయిర్ మాస్క్‌తో వేసవి వేడిని అధిగమించండి!

నవతెలంగాణ : వేసవి కాలం సమీపిస్తోంది, దానితో పాటు మండే వేడిని కూడా తీసుకువస్తుంది, ఇది మీ జుట్టు నుండి తేమను తీసివేస్తుంది, దానితో జుట్టు పొడిగా, నిస్తేజంగా మరియు నిర్వహణ కష్టతరంగా మారుస్తుంది. ఈ సీజన్లో మీ జుట్టును ఆరోగ్యంగా మరియు హైడ్రేట్ గా ఉంచడానికి, సరైన పదార్థాలతో దానిని పోషించడం చాలా అవసరం. తేమను లాక్ చేయడానికి, జుట్టును దృఢమైనదిగా చేయడానికి మరియు వేసవి నష్టం నుండి జుట్టును రక్షించడానికి కలబంద మరియు కొబ్బరి ఒక ఖచ్చితమైన చక్కని కలయిక. మీరు ఈ ప్రయోజనాలను పొందడానికి సులువైన ఇంకా ప్రభావవంతమైన మార్గం కోసం చూస్తున్నట్లయితే, పారాచూట్ అడ్వాన్స్డ్ అలోవెరా ఎన్‌రిచ్డ్ కొబ్బరి నూనె వన్-స్టాప్ పరిష్కారంగా ఉంటుంది. అలోవెరా మరియు కొబ్బరి యొక్క మంచితనంతో సమృద్ధిగా ఉన్న ఈ తేలికపాటి, జిగట లేని ఫార్ములా గొప్ప పోషణను అందిస్తుంది.

ఎంజీ నుంచి కామెట్ బ్లాక్‌స్టార్మ్ ఎడిషన్ ఆవిష్కరణ



న్యూఢిల్లీ : జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా తన కామెట్ విద్యుత్ కారును బ్లాక్‌స్టార్మ్ ఎడిషన్‌లో ఆవిష్కరించింది. ఈ నలుపు రంగు బుజ్జి కారు ఎక్స్ షోరూం ధరను రూ.7.8 లక్షలుగా నిర్ణయించింది. అయితే బ్యాటరీకి అదనంగా చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించింది. కాగా బ్యాటరీ ధర ఎంతనేది స్పష్టం చేయలేదు. కామెట్ ఎగ్జిక్యూటివ్ వేరియంట్ ధర రూ.4.99 లక్షలతో (బ్యాటరీ రెంట్ అదనం) పోలిస్తే దీని ధర దాదాపు 2.8 లక్షలు ఎక్కువ. కొత్త ఎంజి కామెట్ బ్లాక్‌స్టార్మ్ ఎడిషన్‌ను రూ.11,000తో బుకింగ్ చేసుకోవచ్చని ఆ కంపెనీ తెలిపింది. 55 రకాల కనెక్టెడ్ ఫీచర్లు కలిగిన ఈ కారు సింగిల్ చార్జ్‌తో 230 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని పేర్కొంది.

ప్యూర్ ఈవీలపై రూ.40వేల క్యాష్ బ్యాక్

హైదరాబాద్ : ప్రముఖ ఇవి ద్విచక్ర వాహన కంపెనీల్లో ఒక్కటైన ప్యూర్ ఈవీ సరికొత్త ఆఫర్‌ను ప్రకటించింది. తమ ఉత్పత్తుల అమ్మకాలను మరింత పెంచుకునేందుకు 'ప్యూర్ పర్ఫెక్ట్ 10' రెఫరల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్టు వెల్లడించింది. మార్చి 31 నాటికి లేదా సంబంధిత అవుట్‌లెట్లలో స్టాక్స్ ఉన్నంత వరకూ ప్యూర్ ఈవీ వాహనాన్ని కొనుగోలు చేసే కొత్త వినియోగదారులకు కూడా ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. ఈ స్కీమ్ కింద కస్టమర్లు ఇవి వాహనాన్ని కొనుగోలు చేసి తమ స్నేహితులు, కుటుంబ సభ్యులకు రెఫర్ చేయడం ద్వారా రూ.40,000 వరకు క్యాష్ బ్యాక్ రివార్డులను పొందవచ్చని తెలిపింది.

అనుమతులివ్వండి



(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు చేసి.. గతేడాది నవంబర్ 4న కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు అందజేసినట్టు ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర క్యాబినేట్ ఆమోదం తెలపాలని అభ్యర్థించారు.

ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగాన్ని వెంటనే మంజూరు చేయండి

ఐటీ రంగం, ఫార్మా పరిశ్రమలు, లాజిస్టిక్ పార్కులతో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రస్తుతమున్న ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) రాబోయే ఐదేండ్లలో మరింత రద్దీగా మారబోతోందని వివరించారు. ట్రిపుల్ ఆర్ ఆవశ్యకత, అవసరాన్ని స్పష్టంగా తెలిపారు. ఈ నేపథ్యంలో రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో ఇప్పటికే 90 శాతం భూసేకరణ పూర్తయినందున ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని వెంటనే మంజూరు చేయాలని ప్రధానికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఉత్తర భాగంతో పాటే దక్షిణ భాగం పూర్తయితే ఆర్ఆర్ఆర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకోగలమన్నారు. దక్షిణ భాగం భూసేకరణకయ్యే వ్యయంలో 50 శాతం భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అలాగే ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉందని వివరించారు. ఈ రీజినల్ రింగ్ రైలు పూర్తయితే తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైలు మార్గాలతో కనెక్టివిటీ సులభమవుతుందని తెలిపారు. అందువల్ల రీజినల్ రింగ్ రైలుకు అనుమతివ్వాలని పీఎంను సీఎం కోరారు. సముద్ర మార్గం లేని తెలంగాణకు వస్తువుల ఎగుమతులు, దిగుమతులు సులువుగా చేసేందుకు రీజినల్ రింగు రోడ్డు సమీపంలో డ్రైపోర్ట్ అవసరమనీ, ఆ డ్రైపోర్ట్ నుంచి ఏపీలోని సముద్ర పోర్టులను కలిపేందుకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు తో పాటు రోడ్డును ఆనుకొని రైలు మార్గం మంజూరు చేయాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు.

మూసీ-గోదావరి లింక్‌కు రూ. 2వేల కోట్లు ఇవ్వండి

తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికత మూసీ నదితో ముడిపడి ఉన్నదనీ, రాజధాని హైదరాబాద్ నగరం మధ్యగా మూసీ ప్రవహిస్తోందని ప్రధానికి వివరించారు. ప్రస్తుతం ఆ మూసీ.. పారిశ్రామిక వ్యర్థాలు, ఆక్రమణలతో మురికి కూపంగా మారిందని గుర్తు చేశారు. అందువల్ల మూసీని ప్రక్షాళన చేసే దిశలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈసా, మూసా నదుల సంగమంలో ఉన్న బాపూ ఘాట్ అభివృద్ధి, మూసీ ప్రక్షాళనకు 27 ఎస్టీపీల నిర్మాణం, మూసీ రిటైనింగ్ వాల్స్, కరకట్టల నిర్మాణం, మూసీ గోదావరి నదుల అనుసంధానంతో కలిపి మొత్తంగా ప్రాజెక్టుకు రూ.20 వేల కోట్లు ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. కేంద్ర జలశక్తి శాఖ నుంచి ఈ నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు 222.7 ఎకరాల రక్షణ భూముల బదిలీకి సహకరించాలని అడిగారు.

కొత్తగా 29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయండి

తెలంగాణ రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రానికి కేవలం 61 ఐపీఎస్ క్యాడర్ పోస్టులు మాత్రమే వచ్చాయని ప్రధానికి సీఎం వివరించారు. ఆ తర్వాత 2016 లో జరిగిన క్యాడర్ రివ్యూలో మరో 15 పోస్టులు అదనంగా వచ్చాయని తెలిపారు. అయితే ఇప్పుడున్న అవసరాలకు ఈ అధికారుల సంఖ్య సరిపోవడం లేదన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వులతో కొత్తగా అమల్లోకి వచ్చిన 10 పోలీస్ యూనిట్లను 29 పోలీస్ యూనిట్లుగా పునర్వ్యవస్థీకరించామని తెలిపారు. అలాగే సైబర్ నేరాలు, డ్రగ్స్ కేసులు పెరగడం, రాష్ట్రంలో పెరిగిన పట్టణాలు, ఇతర అవసరాల దృష్ట్యా తెలంగాణకు అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయాలని మోడీని రేవంత్ కోరారు. 2021లో జరగాల్సిన క్యాడర్ రివ్యూ జరగలేదని గుర్తు చేశారు. అయితే ఏపీలో 2024 లో కేడర్ సమీక్ష చేశారని చెప్పారు.

సెమీ కండక్టర్ మిషన్‌కు అనుమతివ్వండి

తెలంగాణను అడ్వాన్సుడ్ సెమీ కండక్టర్ అండర్ ఎలక్ట్రానిక్స్ మ్యానుఫాక్షరింగ్ హబ్‌గా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్‌లో పేరొందిన సంస్థలు ఇప్పటికే రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేశాయన్నారు. అలాగే ఫాక్స్ కాన్, కేనెస్ లాంటి ప్రముఖ సంస్థలు యూనిట్లు నెలకొల్పినట్టు వివరించారు. ఈ పరిశ్రమలకు అవసరమైన అన్ని అనుకూలతలు రాష్ట్రంలో ఉన్నాయనీ, భూకంపాల నుంచి సేఫ్‌గా ఉండే నైసర్గిక స్వరూపంతో పాటు పరిశ్రమల ఏర్పాటు, అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు, నిపుణులు అందుబాటులో ఉండడంతో సెమీ కండక్టర్ పరిశ్రమల పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానంగా మారిందని వివరించారు. సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు తెలంగాణలో ఉన్నందున ఇండియా సెమీ కండక్టర్ మిషన్ ప్రాజెక్టును రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు అనుమతించాలని ప్రధానిని కోరారు.

సీఎం రేవంత్‌కు పీఎం నివేదిక

ఈ భేటీలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై సీఎం రేవంత్ రెడ్డికి ప్రధాని మోడీ నివేదిక అందజేశారు. 2017 నుంచి 2022 వరకు తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉంటూ వస్తోన్న అంశాలపై దృష్టి పెట్టాలనీ, వాటిని పరిష్కరించాలని సూచించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం 2016-17 నుంచి తెలంగాణలో అమలు కావడం లేదనీ, దాని అమలుపై దృష్టి పెట్టాలన్నారు. ఆవాస్ 2018 మొబైల్ అప్లికేషన్ ద్వారా 2025 మార్చి 31 నాటికల్లా సర్వే పూర్తి చేయాలనీ, అర్హులను గుర్తించాలని చెప్పారు. అలాగే వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో మూడు మొబైల్ కనెక్టివిటీ ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయనీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రోడ్ల నిర్మాణం, అటవీ పర్యావరణ అనుమతులు ఇవ్వాలని ప్రధాని తెలిపారు. తెలంగాణలోని మూడు నీటిపారుదల ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు, సవరించిన అంచనాలు పంపించాలని సూచించారు. దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, రాజీవ్ బీమా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు స్టేజ్-2 కింద రూ.18,189.53 కోట్ల విలువైన పనులకు అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. బీబీనగర్ ఎయిమ్స్‌కు రూ.1365.95 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి విద్యుత్ కనెక్షన్ వాటర్ సప్లై కోసం పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని పరిష్కరించాలన్నారు.

శంషాబాద్‌లో వంద పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం కోసం ప్రభుత్వ భూమికి పెండింగ్‌లో ఉన్న రూ.150 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. రెండు రైల్వే ప్రాజెక్టులు మనోహరాబాద్-కొత్తపల్లి నూతన రైల్వే లైన్, కాజీపేట-విజయవాడ మూడో లైన్ విద్యుదీకరణకు సంబంధించి రూ.3,113.48 కోట్లతో 2020 నుంచి భూసేకరణ అటవీ అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయనీ, త్వరగా క్లియర్ చేయాలన్నారు. ప్రధాని సూచించిన పెండింగ్ ప్రాజెక్టులకు సంబంధించి అధికారులతో సమీక్ష జరిపి వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

ఆహారోత్పత్తుల పేరుతో లైసెన్స్

టాబ్లెట్ల తయారీ, అమ్మకాలు : డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడుల్లో వెల్లడి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అక్రమాలు చేసేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. ఆహారోత్పత్తుల పేరుతో అనుమతి పొంది టాబ్లెట్ల రూపంలో మందులను ఫుడ్ సప్లిమెంట్లుగా అమ్ముకుంటూ దందా చేస్తున్నారు. డ్రగ్ కంట్రోల్ అధికారులు రాష్ట్రంలో వరుసగా చేస్తున్న దాడుల్లో విస్తుపోయే నిజాలు బయటపడుతున్నాయి. చట్టాలు కఠినంగా ఉన్నాయనీ, శిక్షలు తప్పవని పదే పదే అధికారులు హెచ్చరిస్తున్నా.. కొంతమంది అక్రమార్కులు మాత్రం పద్ధతి మార్చుకోవడం లేదు. విశ్వసనీయ సమాచారం మేరకు డ్రగ్ కంట్రోల్ అధికారులు తాజాగా చేసిన దాడుల్లో ఈ తరహా మందులను తయారు చేసి, అమ్ముతున్నట్టు అధికారులు గుర్తించారు.

హైదరాబాద్‌లోని ముషీరాబాద్ డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడిలో ఫోరన్- ఎక్స్‌టీ టాబ్లెట్లను సీజ్ చేశారు. వీటిలో ఫెర్రాస్ అస్కార్బేట్, ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్స్, జింక్ సల్ఫేట్ టాబ్లెట్స్ ఉన్నాయి. వీటిని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా చెంగిచెర్ల గ్రామం, రంగరంగయ్య నగర్, మక్రా ల్యాబోరేటరీస్‌లో తయారు చేస్తుండగా.. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్, అశోక్ నగర్, ఇండస్ట్రియల్ కాలనీలోని జైవె ఫార్మాసిటికల్స్ మార్కెటింగ్ చేస్తున్నది. వీటిని ఆహార ఉత్పత్తిగా తప్పుడు ప్రచారం చేస్తూ అమ్ముతున్నారు. డ్రగ్స్ అండ్ కాస్మాటిక్స్ యాక్ట్, 1940 ప్రకారం వీటిని మందులుగా వర్గీకరించినట్టు అధికారులు తెలిపారు. వీటిని తయారు చేయాలంటే తప్పనిసరిగా డ్రగ్ లైసెన్స్ కలిగి ఉండాలనిన్నారు. సదరు ల్యాబోరేటరీస్ లైసెన్స్ తీసుకోకుండా తయారు చేస్తుండటంతో అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధుమేహానికి, మూత్రపిండాల్లో రాళ్లకు..

డయాబెటీస్ తగ్గించేందుకు, మూత్రపిండాల్లో రాళ్లు కరిగించేందుకు మందులంటూ తప్పుడు ప్రకటనలతో అమ్ముతున్న ఆయుర్వేదిక్ మందులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజయవాడలోని భవానీపురం, ఎం.పీ.దాస్ స్ట్రీట్‌కు చెందిన అమూల్య హెర్బల్స్ తయారు చేసిన ఆయుర్వేదిక్ మెడిసిన్ పొడపత్రి పౌడర్‌ను డయాబెటిక్ చికిత్సకంటూ లేబుల్‌పై ప్రకటనతో అమ్ముతున్నట్టు అధికారులు మిర్యాలగూడలో చేసిన దాడిలో గుర్తించారు. అదే విధంగా ఉత్తరాఖండ్‌కు చెందిన పటేల్ హెల్త్‌కేర్ తయారు చేసిన స్టోన్-గో అల్కలైజర్ సిరప్ ఆయుర్వేదిక్ మందును మూత్రపిండాల్లో రాళ్ల చికిత్సకంటూ తప్పుడు ప్రకటనతో అమ్ముతున్నట్టు సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ గ్రామంలో పట్టుకున్నారు. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (ఆబ్జెక్షనబుల్ అడ్వర్టైజ్ మెంట్) యాక్ట్, 1954 ప్రకారం ఇలా చికిత్సకంటూ పేర్కొనడం నిషేధమని అధికారులు తెలిపారు. వీటిపై దర్యాప్తు కొనసాగుతున్నది. తప్పుడు ప్రకటనలు చేయడం మానుకోవాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి కోరారు. అలాంటి తప్పుడు ప్రకటనలు ప్రజలు గమనిస్తే 1800-599-6969 నెంబర్‌కు కాల్ చేసి తెలపాలని కోరారు. నకిలీ మందుల రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అన్ని పని దినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాల్ చేయవచ్చని తెలిపారు.

నియోజకవర్గాల పునర్విభజనతో

దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

దేశ సంక్షేమం కోసం జనాభా నియంత్రణ పాటిస్తే శిక్షిస్తారా? : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం కేటీఆర్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. జనాభా ప్రాతిపాదికన నియోజకవర్గాలను పునర్విభజించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తెలంగాణతో సహా ఇతర దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, కేరళలకు శాపంగా పరిణమిస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సామాజిక మాధ్యమాల్లో వ్యక్తం చేసిన ఆందోళనలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నట్టు స్పష్టం చేశారు. దేశ సంక్షేమం కోసం జనాభా నియంత్రణను ఒక యజ్ఞంలా భావించి, దాన్ని విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం శిక్షించాలని చూస్తోందా అని కేటీఆర్ ప్రశ్నించారు. "జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు చేసిన కృషిని పట్టించుకోకుండా, కేవలం జనాభా ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడం ప్రజాస్వామ్యానికి, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం" అని ఆయన మండిపడ్డారు. దక్షిణాది రాష్ట్రాలు దేశ నిర్మాణంలో అందించిన సహకారాన్ని ఎవరూ కాదనలేరని ఆయన అన్నారు. "1951లో దక్షిణాది రాష్ట్రాల జనాభా వాటా 26.2 శాతం ఉండగా, 2022 నాటికి అది 19.8 శాతానికి పడిపోయింది. అదే సమయంలో ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి ఉత్తర రాష్ట్రాల జనాభా వాటా 39.1 శాతం నుంచి 43.2 శాతానికి పెరిగింది. ఈ పరిస్థితుల్లో జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లను నిర్ణయిస్తే, ఉత్తరప్రదేశ్, బీహార్‌కు కలిపి 222 సీట్లు వస్తాయి, అయితే ఐదు దక్షిణాది రాష్ట్రాలకు (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, కేరళ) కలిపి కేవలం 165 సీట్లు మాత్రమే లభిస్తాయి" అని కేటీఆర్ వివరించారు.

"దక్షిణాది రాష్ట్రాలు ఆర్థిక వృద్ధి, మానవ అభివృద్ధి సూచికలు, జనాభా నియంత్రణ వంటి అన్ని రంగాల్లో ఉత్తరాది రాష్ట్రాల కంటే గణనీయంగా మెరుగైన పనితీరు కనబరిచాయి. అలాంటి రాష్ట్రాలను శిక్షించి, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించడం దేశ ప్రయోజనాలకు వ్యతిరేకం" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభా కంటే ఆర్థిక సహకారాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని కేటీఆర్ ప్రతిపాదించా రు. "తెలంగాణ జనాభా దేశ జనాభాలో కేవలం 2.8 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, దేశ జీడీపీలో 5.2 శాతం కంటే ఎక్కువ సహకారం అందిస్తోంది. ఇదే విధంగా దక్షిణాది రాష్ట్రాలు దేశ ఆర్థిక వ్యవస్థకు అపారమైన సహకారం అందిస్తున్నాయి. కాబట్టి నియోజకవర్గాల పునర్విభజనలో ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి" అని ఆయన సూచించారు.

NDRF రెస్క్యూ ఆపరేషన్ కు మద్దతుగా ఏరోస్పేస్ డ్రోన్లను మోహరించిన గరుడ

నవతెలంగాణ : భారతదేశంలోని ప్రముఖ డ్రోన్ కంపెనీ గరుడ ఏరోస్పేస్, తెలంగాణలోని నాగర్ కర్నూల్ లోని శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (SLBC) టన్నెల్ కూలిపోవడంతో జరుగుతున్న కీలకమైన రెస్క్యూ ఆపరేషన్ లో జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (NDRF) కు మద్దతుగా తమ కన్స్యూమర్ డ్రోన్, ద్రోణిని మోహరించింది. అధిక మొత్తంలో నీరు మరియు బురద చేరుకోవటం కారణంగా రెస్క్యూ ప్రయత్నం తీవ్ర అడ్డంకులను ఎదుర్కొంటోంది, ఇది చాలా పరిమిత దృశ్యమానతతో ప్రమాదకర వాతావరణాన్ని సృష్టిస్తుంది. గరుడ ఏరోస్పేస్ డ్రోన్లను మ్యాపింగ్ మరియు వ్యూహాత్మక రెస్క్యూ ప్లానింగ్ కోసం ఉపయోగిస్తున్నారు. సవాలుతో కూడిన పరిస్థితుల మధ్య చిక్కుకున్న కార్మికులను గుర్తించడంలో కూడా ఇది సహాయపడుతుంది , చాలా తక్కువ దృశ్యమానత ఉన్నప్పటికీ సొరంగం లోపలి భాగాన్ని స్పష్టమైన రీతిలో చిత్రించటం, నిజ-సమయ వీడియో ఫీడ్‌లను ప్రసారం చేయటం చేస్తున్నారు.

టాటా ప్లే బింగేలో సూపర్ స్టార్స్ శివకార్తికేయన్ మరియు నాని సినిమాలు

నవతెలంగాణ : శివకార్తికేయన్ మరియు నాని తమ పుట్టినరోజులను ఆచరించుకుంటున్న నేపథ్యంలో, సినిమాల్లో వారి అద్భుతమైన ప్రయాణాలను ప్రశంసించేందుకు ఇది సరైన సమయం. ఇద్దరు నటులు ప్రత్యేకమైన నటనా శైలితో తమదైన ముద్రను ప్రేక్షకులపై వేశారు. వారి బహుముఖ ప్రజ్ఞ, అప్రయత్నంగా ఆకట్టుకునే శైలి, ఆకర్షణీయమైన పాత్ర ఎంపికలతో ప్రేక్షకుల హృదయాలను గెల్చుకున్నారు. ఫీల్-గుడ్ ఎంటర్‌టైనర్‌ల నుంచి ఉత్కంఠత రేకెత్తించే డ్రామా వరకు, వారి ఫిల్మోగ్రఫీ ఆకట్టుకునే వృద్ధిని ప్రతిబింబిస్తుంది. వారి సామర్థ్యాన్ని ప్రతిసారీ రుజువు చేస్తూనే ఉంటుంది. వారిద్దరూ ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న గ్రాఫ్‌తో, దక్షిణ భారత సినిమాలో అత్యంత ప్రియమైన తారలుగా గుర్తింపు దక్కించుకున్నారు. మైలురాయిగా నిలిచే ఈ పుట్టినరోజును వారి ఉత్తమ ఓటీటీ ప్రదర్శనలతో ఆచరించుకోవడం కన్నా మెరుగైన మార్గం ఏమిటి? శివకార్తికేయన్, నాని నటించిన అత్యంత ప్రియమైన సినిమాలను టాటా ప్లే బింగేలో చూడండి!

స్టాక్ జార్విస్ జీపీటీ ఆవిష్కరణ

నవతెలంగాణ : ఏఐ-ఆధారిత వీడియో విశ్లేషణలలో ప్రముఖ ఆవిష్కర్త అయిన స్టాక్, రియల్-టైమ్ కస్టమర్ అంతర్దృష్టులు, స్టోర్ పర్యవేక్షణ, ప్రిడిక్టివ్ అనలిటిక్స్ రిటైల్ పరిశ్రమను మార్చడానికి రూపొందిన అధునాతన ఏఐ మోడల్ అయిన జార్విస్ జీపీటీని ప్రారంభించినట్లు ప్రకటించింది. జనరేటివ్ ఏఐ శక్తిని ఉపయోగించుకుని, జార్విస్ జీపీటీ రిటైలర్లు డేటా-ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికి, స్టోర్ పనితీరును ఆప్టిమైజ్ చేయడానికి, కస్టమర్ షాపింగ్ అనుభవాన్ని మెరుగుపరచడానికి అధికారం ఇస్తుంది. స్టాక్ ఫ్లాగ్‌షిప్ వీడియో అనలిటిక్స్ ప్లాట్ఫామ్ అయిన జార్విస్ విజయం ఆధారంగా, జార్విస్ జీపీటీ భారీ మొత్తంలో రిటైల్ డేటాను ప్రాసెస్ చేయడానికి, కార్యాచరణ అంతర్దృష్టులను సంగ్రహించడానికి, చురుకైన వ్యాపార వ్యూహాలను ప్రారంభించడానికి జనరేటివ్ ఏఐని ఏకీకృతం చేస్తుంది.

లైఫ్ సైన్సెస్ గ్రిడ్‌లో అజిలిసియం కొత్త ఆవిష్కరణ

నవతెలంగాణ : లైఫ్ సైన్సెస్ పరిశ్రమకు ప్రముఖ డేటా ఇన్నోవేషన్ భాగస్వామి అయిన అజిలిసియం తెలంగాణ యొక్క ప్రతిష్టాత్మక "లైఫ్ సైన్సెస్ గ్రిడ్ స్ట్రాటజీ" లో గణనీయమైన పెట్టుబడి పెడుతోంది. ఇది లైఫ్ సైన్సెస్ ఇన్నోవేషన్‌కు ప్రపంచ కేంద్రంగా రాష్ట్ర స్థానాన్ని బలోపేతం చేస్తుంది. ఈ వ్యూహాత్మక విస్తరణలో భాగంగా, సంస్థ హైదరాబాద్‌లో లైఫ్ సైన్సెస్ ఇన్నోవేషన్ అండ్ టాలెంట్ డెవలప్‌మెంట్ ల్యాబ్‌ను ప్రారంభిస్తోంది. రాబోయే 36 నెలల్లో 2,000 ఉద్యోగ అవకాశాలను సృష్టించడానికి కట్టుబడి ఉంది.

నటుడు పోసాని కృష్ణ మురళి అరెస్ట్



హైదరాబాద్ : సినీ నటుడు పోసాని కృష్ణ మురళిని పోలీసులు అరెస్టు చేశారు. రాయదుర్గం మైహెూం భుజా అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్న పోసానిని బుధవారం ఏపీలోని రాయచోటి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాయదు ర్గం పోలీసులకు సమాచారం ఇచ్చిన తర్వాత పోసానిని రాయచోటి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఏపీలోని వివిధ పోలీస్ స్టేషన్లలో అతనిపై పలు కేసులు ఉన్నాయి. అయితే, ఏ కేసులో అరెస్టు చేశారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏపీఎఫ్‌టీవీడీసీ ఛైర్మెన్‌గా పనిచేసిన పోసాని వివాదస్పదవ్యాఖ్యలు చేశారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోపాటు మంత్రి నారా లోకేశ్‌ను అసభ్యకరంగా దూషించారు. కూటమి నేతల ఫిర్యాదు మేరకు పోసానిపై సీఐడీ కేసు నమోదు చేసింది. ఏపీలో పలు పోలీస్‌స్టేషన్‌లలోనూ ఆయనపై కేసులు నమోదయ్యాయి. టీటీడీ ఛైర్మెన్ బీఆర్ నాయుడిని ఏకవచనంతో సంబోధించడమే గాక, తిరుమల కొండపై దోపిడీ చేయడానికి వచ్చారంటూ పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో పోసానిపై బాపట్ల, అనంతపురం, పల్నాడు జిల్లా నరసరావుపేట, చిత్తూరు జిల్లా యాదమరి, తిరుపతి జిల్లా పుత్తూరులో పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో పోసాని విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రాజకీయాలకు దూరంగా ఉంటున్నట్టు ప్రకటించారు.

అల్పాహారం కోసం ఎదురుచూపులు

- ఖాళీ కడుపుతో పాఠశాలలకు విద్యార్థులు
- వెంటాడుతున్న పౌష్టికాహారం, రక్తహీనత సమస్యలు
- బ్రేక్‌ఫాస్ట్ పెట్టాలని విద్యార్థుల వేడుకోలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేది దాదాపు పేద విద్యార్థులే.. దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు చేరుకునేవారూ ఉంటారు. ఉదయం ఏమీ తినకపోవడంతో విద్యార్థులు పాఠశాలల్లో కండ్లు తిరిగి పడిపోయిన ఘటనలు ఉన్నాయి. సరైన భోజనం లేక ఆరోగ్యం కుంటుపడటంతోపాటు చదువుపై అంత శ్రద్ధ పెట్టడం లేదన్న చర్చా ఉంది. విద్యార్థులు సమయానికి తగిన ఆహారం తీసుకున్నప్పుడే విద్యలో రాణిస్తారని విద్యావేత్తలు చెబుతున్నారు. వాస్తవానికి ఉదయం పూట పిల్లలకు అల్పాహారం అందిస్తే.. వారికి బూస్ట్‌గా మారనుంది. ఈ నెల 18న హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన రాష్ట్ర విద్యా కమిషన్ బహిరంగ విచారణలోనూ పలువురు విద్యార్థులు ఇదే విషయాన్ని కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. వారి మాటల్లో.. 'సర్కారు బడిలో చదువుకునే వాళ్లంతా పేద విద్యార్థులమే. మా తల్లిదండ్రులు రోజూ పనికి వెళ్లితే వచ్చే డబ్బులతోనే ఇంట్లో పూట గడిచేది. కుటుంబాన్ని పోషించుకోవడానికి పనికి వెళ్లే క్రమంలో పిల్లలను చూసుకోవడానికి సమయం ఉండదు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని స్కూల్ విద్యార్థులకు ఉదయం బ్రేక్ ఫాస్ట్ పెట్టాలి' అని పలువురు విద్యార్థులు వారిని కోరారు.



రాష్ట్రంలో 26వేలకుపైగా ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 16.86లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. హైదరాబాద్ జిల్లాలో 691 ప్రభుత్వ పాఠశాలల్లో లక్ష మందికిపైగా విద్యార్థులున్నారు. 2023లో ఎన్నికల ముందు అప్పటి ప్రభుత్వం సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించింది. పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఈ పథకాన్ని తొలుత ఒక్కో నియోజకవర్గంలోని ఒక్కో ప్రభుత్వ పాఠశాలలో మంత్రులు, ఎమ్మెల్యేల చేతుల మీదుగా ప్రారంభించారు. హైదరాబాద్ జిల్లాలో దాదాపు 15స్కూళ్లలో ప్రారంభించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా 3వేల స్కూళ్లలో.. నగరంలో 40 పాఠశాలల్లో ఈ పథకాన్ని కొనసాగించారు. అయితే, ప్రారంభంలో ఎమ్మెల్యేలు, అక్కడక్కడా కొంతమంది దాతలు సహాయం చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం నిధులు కేటాయించలేదన్న విమర్శలు వినిపించాయి. కొత్త ప్రభుత్వం వచ్చినా ప్రారంభం కాలేదు. ఈ పథకం అమల్లో భాగంగా మొదట్లో విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం ఇడ్లీ, ఉప్మా, కిచిడీ, పొంగలి, వెజిటేబుల్ పులావ్, టమాట బాత్, పూరి ఆలు కుర్మలో ఏదో ఒకటి పెట్టేవారు. తరగతులు ప్రారంభానికి అరగంట ముందు విద్యార్థులకు అందించేవారు. ప్రస్తుతం నగరంలో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్న మన్నా ట్రస్ట్ ద్వారానే ఈ పథకం కొనసాగింది. నిజానికి ఈ పథకం అమలుతో విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉండేది. సాయంత్రం స్నాక్స్‌కు నిధులు కేటాయించినట్టుగానే అల్పాహారానికి సీఎం రేవంత్‌రెడ్డి నిదులు కేటాయించాలని, పేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు.

గతంలో ఎన్నికల ముందు..

గత ప్రభుత్వం సరిగ్గా సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ ముందు సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేసింది. నిధులు లేకపోవడంతో విద్యాశాఖ అధికారులు అల్పాహారం అందించిన సంస్థకు ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి. 2023 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అప్పటివరకు కొనసాగిన బ్రేక్‌ఫాస్ట్ పథకం ఆగిపోయింది. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు బడులపై ప్రత్యేక దృష్టిసారించింది. సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా అమ్మ ఆదర్శ పాఠశాల పేరిట కోట్ల రూపాయలతో అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఇతర అనేక కార్యక్రమాలను చేస్తోంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తోంది. కానీ పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా కొనసాగించాలని కోరుతున్నారు. సర్కారు బడుల్లో చదివే విద్యార్థులు సమయానికి భోజనం చేయకపోవడం, పౌష్టికాహార లోపం, రక్త హీనత సమస్యలు వెంటాడుతున్నాయని పలు సర్వే సంస్థలు వెల్లడిస్తున్నాయి.